ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



12 వరకు అభ్యంతరాలుంటే తెలపాలి

అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి



సమావేశంలో మాట్లాడుతున్న వీరబ్రహ్మచారి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): గ్రామ పంచాయతీ ఎన్నికలు-2025 పోలింగ్‌కేంద్రాల జాబితా డ్రాఫ్ట్ ప్రచురణ అన్నిగ్రామపంచాయతీల్లో ఈనెల 7న ప్రకటించనైనదని, ఏమైనా అభ్యంతరాలుంటే ఈనెల 12 వరకు మండల ప్రజాపరిషత్ అభివృద్ధి కార్యాలయంలో తెలపాలని జిల్లా అదనపు కలెక్టర్ వీరబ్రహ్మచారి సూచించారు. కలెక్టర్ కార్యాలయంలో మంగళవారం జిల్లాస్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో గ్రామ పంచాయతీ పోలింగ్ కేంద్రాల జాబితా డ్రాఫ్ట్ ప్రచురణపై సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 13న పోలింగ్‌కేంద్రాల జాబితా అభ్యంతరాలను పరిష్కరించి కలెక్టర్ ఆమోదంతో ఈనెల 17న ఫైనల్ జాబితాను ప్రచురిస్తారని చెప్పారు. అదే విధంగా ఈనెల 12న మండలపరిషత్ కార్యాలయాల్లో మండలస్థాయి రాజకీయ పార్టీల ప్రతినిధులతో సమావేశాలను నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. డీపీవో హరిప్రసాద్, వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులు మార్నేని వెంకన్న, నీరుటి సురేష్‌నాయుడు, సాదుల శ్రీనివాస్, గునిగంటి రాజన్న పాల్గొన్నారు.



ఎదురుచూపులు



మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం నుంచి విద్యార్థులకు డైట్‌బిల్లులు రాకపోవడంతో హాస్టల్ వెల్ఫేర్ అధికారులు (హెచ్‌డబ్ల్యూవో)లు అవస్థలు పడుతున్నారు. మహబూబాబాద్ జిల్లా వ్యాప్తంగా ఉన్న షెడ్యూల్డ్ కులాల (ఎస్సీ) వసతి గృహాల్లో విద్యనభ్యసిస్తున్న స్టూడెంట్స్‌కు ప్రభుత్వం నుంచి నిధులు విడుదల కాకపోవడంతో ఆర్థికంగా పడరానిపాట్లు పడుతున్నారు. హాస్టళ్లలో ఉంటూ విద్యనభ్యసిస్తున్న వారికి ప్రభుత్వం మెనూ విడుదల చేసి, అమలు చేయాలని ఆదేశాలు జారీ చేయడంతో వార్డెన్‌లు అమలు చేస్తున్నప్పటికీ సకాలంలో బిల్లులు రాక నెలల తరబడి పెండింగ్‌లో ఉండటంతో ఒత్తిడికి గురవుతున్నారు. హెచ్‌డబ్ల్యూవోలు తమ వేతనాలను హాస్టల్ విద్యార్థుల డైట్‌కు ఉపయోగించడం, అవి కూడా సరిపోకపోవడంతో కిరాణ షాపు, కూరగాయలు, చికెన్, పాలు, గుడ్లు మొదలగు షాపుల్లో అప్పులు చేయాల్సి వస్తోందని వాపోతున్నారు. వివిధ షాపుల్లో తెచ్చిన సరుకులకు ప్రతీనెల బిల్లులు చెల్లించకపోవడంతో వారు కూడా ఖాతా పెట్టడంలేదని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

1,480 మంది విద్యార్థులు

మహబూబాబాద్ జిల్లాలోని 18 మండలాల పరిధిలో 23 ఎస్సీ హాస్టల్స్ ఉన్నాయి. ఇందులో ప్రీమెట్రిక్ 19, పోస్ట్ మెట్రిక్ 4 మొత్తంగా 23 హాస్టల్స్‌లో 1,480 మంది విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు. 19 ప్రీ మెట్రిక్ హాస్టల్స్‌లో 3వ తరగతి నుంచి 10వ తరగతి విద్యార్థులు ఉంటున్నారు. ఇందులో బాలికల హాస్టల్స్ 5 ఉండగా 187 మంది, 14 బాలుర హాస్టల్స్ ఉండగా 927 మొత్తం 1480 మంది విద్యనభ్యసిస్తున్నారు. 4 పోస్ట్ మెట్రిక్ హాస్టల్స్‌లో ఇంటర్మీడియట్ నుంచి పోస్ట్ గ్రాడ్యుయేట్ వరకు 147 మందివిద్యనభ్యసిస్తున్నారు. ఇందులో రెండు మహిళా హాస్టల్స్‌లో 105 మంది, రెండు బాలుర హాస్టల్స్‌లో 42 మంది ఉంటూ విద్యనభ్యసిస్తున్నారు. ప్రతీ హాస్టల్‌లో కనీసం 20 మంది విద్యార్థులకు తగ్గకుండా ఉంటున్నారు. ప్రీమెట్రిక్‌లో 3 నుంచి 7వ తరగతి విద్యార్థుల వరకు ప్రతీనెల ఒక విద్యార్థికి రూ.950, 8,9,10 తరగతుల విద్యార్థులకు ఒక్కరికి రూ.1,050 కేటాయిస్తుండగా, పోస్ట్‌మెట్రిక్‌లో ప్రతీ విద్యార్థికి రూ. 1500 కేటాయిస్తున్నారు. ఈ ఏడాది నవంబరు 1 నుంచి 3వ తరగతి నుంచి 7వ తరగతి వరకు రూ.1100, 8, 9, 10 తరగతుల విద్యార్థులకు రూ. 1540, కళాశాల విద్యార్థులకు రూ. 2100కు పెంచారు.

ప్రతీ హాస్టల్‌కు రూ.4లక్షల నుంచి రూ.6లక్షల బకాయిలు..

జిల్లా వ్యాప్తంగా ఉన్న 23 హాస్టల్స్‌కు 2024 జనవరి నుంచి నవంబరు వరకు 11 నెలలుగా డైట్ బిల్లులు రాకపోతే హాస్టళ్ల నిర్వాహణ ఎలా అని వార్డెన్‌లు తలలు పట్టుకుంటున్నారు. ప్రతీ హాస్టల్‌కు సుమారు రూ.4 నుంచి రూ.6 లక్షల వరకు పెండింగ్ బిల్లులు ఉంటాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా పెండింగ్ బిల్లులు సుమారు రూ.3 కోట్ల వరకు ఉంటాయని తెలుస్తోంది. కార్పొరేట్ స్థాయిలో విద్యనందిస్తూ, నాణ్యమైన పౌష్టికాహార భోజనం అందిస్తున్నామని చెబుతున్న పాలకులు, సంబంధిత అధికారులు నెలల తరబడి పెండింగ్‌లో ఉంటున్న బిల్లుల మంజూరులో మాత్రం శ్రద్ధచూపడంలేదని వాపోతున్నారు.

బిల్లుల జాప్యంతో ముందుకు రాని టెండర్‌దారులు..

గతమూడేళ్ల కంటే ముందు హాస్టల్ విద్యార్థుల డైట్ నిర్వహణకు కావాల్సిన చికెన్, గుడ్లు, పాలు, కూరగాయలు మొదలగు నిత్యావసర సరుకులు సరఫరా చేసేందుకు టెండర్లు వేసేవారు. అప్పుడు ప్రైవేట్ వ్యక్తులు టెండర్‌లు వేసి, సరుకులను అందించేవారు. ప్రతీ నెల లక్షలాది రూపాయలు వెచ్చించినప్పటికీ నెలనెలా బిల్లులు రాకపోవడం, నెలల తరబడి పెండింగ్‌లో ఉండటం వల్లనే టెండర్లు వేసేందుకు ముందుకురాలేదని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. నిధులు సకాలంలో రాక పోవడంతో క్రమక్రమంగా ప్రైవేట్ వ్యక్తులు టెండర్లు వేయడం మానేయడంతో ఆ నిర్వహణ బాధ్యత హాస్టల్ వార్డెన్లపై పడింది. ప్రస్తుతం కూడా నెలనెలా బిల్లులు రాకపోవడంతో వార్డెన్లు ఆర్థిక సమస్యలతో కొట్టుమిట్టాడుతున్నారు. సకాలంలో బిల్లులు చెల్లించాలని హెచ్‌డబ్ల్యూవోలు వేడుకుంటున్నారు.

- 11 నెలలుగా బిల్లులు రాక వార్డెన్ల కష్టాలు
- జిల్లాలో 23 మంది ఎస్సీ హాస్టల్ అధికారుల నిరీక్షణ
- ఒక్కో వసతి గృహానికి రూ.లక్షల్లో బకాయిలు
- సుమారు రూ.3కోట్లు పెండింగ్!
- చెల్లింపులు చేయాలని ప్రభుత్వానికి విజ్ఞప్తులు

బిల్లులు చేసి ఎస్టీవోకు పంపించాం



నర్సింహాస్వామి, ఇన్‌చార్జ్ జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి

ప్రభుత్వం నుంచి వచ్చిన బడ్జెట్ ప్రకారం ప్రీమెట్రిక్ జూలై వరకు, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లకు నవంబరు నెల వరకు బిల్లులు చేసి, ఎస్టీవోకు పంపించాం. ఆయాహాస్టళ్ల వారీగా విద్యార్థుల సంఖ్యకనుగుణంగా హాస్టల్ వార్డెన్లు బిల్లులు చేసుకుని ఎస్టీవోలో సమర్పించాలి. వార్డెన్‌లు సమర్పించిన బిల్లుల కనుగుణంగా వారి అకౌంట్లలో జమ అవుతాయి.



సైబర్ మోసాలపై అవగాహన కలిగి ఉండాలి

- ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సైబర్ మోసాలపై కుటుంబ సభ్యులకు అవగాహన కలిపించాలని ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ సోషల్ మీడియా వేదికగా మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సైబర్ మోసాలకు ఎక్కువగా గురవుతున్నది వయోవృద్ధులు, గృహిణిలేనని పేర్కొన్నారు. మనచుట్టూ జరుగుతున్న సైబర్ మోసాలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. అవగాహన, అప్రమత్తత ద్వారా సైబర్ నేరాలను అరికట్టవచ్చన్నారు. ఓటీపీ మోసాలు, ఫిషింగ్ పార్ట్‌టైం స్కాం వంటి వాటిపై చర్చించాలన్నారు. సైబర్ మోసాలకు గురైతే వెంటనే సైబర్ క్రైం హెల్ప్ లైన్ నెంబర్ : 1930కి ఫోన్‌చేసి సమీప పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని సూచించారు.

జాబ్‌మేళా అప్రెంటిషిప్‌ను సద్వినియోగం చేసుకోవాలి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సికింద్రాబాద్‌లో బుధవారం జరిగే నిరుద్యోగ జాబ్‌మేళా అప్రెంటిషిప్‌ను సద్వినియోగం చేసుకోవాలని ఎస్సీ కార్పొరేషన్ కార్యనిర్వాహక సంచాలకుడు కె.శ్రీనివాసరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. డిపార్టుమెంట్ ఆఫ్ టెక్నాలజీ ఎడ్యుకేషన్ తెలంగాణ వారు సికింద్రాబాద్‌లోని సర్దార్ పటేల్ కాలేజీలో ఈ నెల 11న ఉదయం 9నుంచి సాయంత్రం 5గంటల వరకు జాబ్ మేళాను నిర్వహిస్తారని చెప్పారు. 2020-24 సంవత్సరంలో పాసైన ఇంజనీరింగ్, నాన్ ఇంజనీరింగ్, ఫార్మసీ, టెక్నికల్ వారు ఈ జాబ్‌మేళా అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్:98498 28586, 81859 09695లను సంప్రదించాలని కోరారు.

గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు

- జిల్లాలో 21 సెంటర్ల ఏర్పాటు
- హాజరవనున్న 7,470 మంది అభ్యర్థులు
- అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

మహబూబాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఈనెల 15,16 తేదీల్లో నిర్వహించే టీజీపీఎస్సీ గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు పకడ్బందీ చర్యలు తీసుకుంటున్నట్లు ఇన్‌చార్జి కలెక్టర్, జిల్లా అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో గ్రూప్-2 పరీక్షల నిర్వహణపై సమీక్షా సమావేశాన్ని మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా వ్యాప్తంగా గ్రూప్-2 పరీక్షల నిర్వహణకు ప్రభుత్వ నిబంధనల ప్రకారం చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 7,470 మంది అభ్యర్థులు పరీక్షకు హాజరుకానున్నారని వారి కోసం 21 ఎగ్జామ్ సెంటర్లను ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. డిసెంబరు 15, 16న రెండురోజుల పాటు ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 3 నుంచి సాయంత్రం 5.30గంటల వరకు నాలుగు దపాలుగా పరీక్షలు జరుగుతాయని పేర్కొన్నారు. తెలంగాణ పబ్లిక్ సర్వీస్ కమిషన్ సూచనల ప్రకారం.. అభ్యర్థులు పరీక్ష కేంద్రంలోకి మొబైల్ ఫోన్స్, ఎలక్ట్రానిక్స్ వస్తువులతో రాకూడదని, పరీక్ష కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుందన్నారు. పరీక్ష కేంద్రాల సమీపాన ఉన్న జిరాక్స్ సెంటర్లను మూసివసేస్తామని తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యుత్ సదుపాయం, టాయిలెట్స్, తాగునీటి సదుపాయం కల్పించాలని సూచించారు. కేంద్రాల వద్ద వైద్య శిబిరాలను ఏర్పాటు చేయాలన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగకుండా అధికారులు ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్రాల వద్ద శానిటేషన్ నిర్వహించాలని, పరీక్ష సమయాల్లో అభ్యర్థుల సౌకర్యార్థం బస్సులను నడపాలన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ కె. వీరబ్రహ్మచారి, అదనపు ఎస్పీ చెన్నయ్య, గ్రూప్-2 పరీక్షల ఆర్సీవో బలరాంనాయక్, ఆర్డీవోలు గణేష్, కృష్ణవేణి, అధికారులు మధుసూదన్‌రాజు, హరిప్రసాద్, డాక్టర్ కిరణ్‌కుమార్, వేముల సురేష్, భద్రకాళి, బాలకృష్ణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న లెనిన్ వత్సల్ టొప్పో

రుణమాఫీ అమలు చేయాలని రాస్తారోకో

ఇనుగుర్తి, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) : రైతులకు రుణమాఫీ అమలు చేయాలని డిమాండ్ చేస్తూ మంగళవారం ఇనుగుర్తి పెద్దబస్టాండ్ సెంటర్లో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సొసైటీ చైర్మన్ దీకొండ వెంకన్న, మాజీ సర్పంచ్ దార్ల రాంమూర్తి మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు రూ.2 లక్షల రుణమాఫీ పూర్తిగా చేయలేదని అన్నారు. రూ.2 లక్షలకు పైగా ఉన్న రుణాల మాఫీ ప్రస్తావనే ప్రభుత్వం తీయడంలేదని ఆరోపించారు. ఇప్పటికైనా రూ.2 లక్షల లోపు, పైగా ఉన్న రుణాలను వెంటనే మాఫీచేసి రైతులను ఆదుకోవాలని కోరారు. అనంతరం తహసీల్దార్ కార్యాలయంలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రామపార్టీ అధ్యక్షుడు బేతమల్ల చంద్రయ్య, మండల వర్కింగ్ ప్రెసిడెంట్ బొబ్బిలి మహేందర్ రెడ్డి, పింగిళి శ్రీనివాస్, జాటోత్ శ్రీను, మంగ్యానాయక్, దేవేందర్, గండు నాగన్న, మద్దెల సుధాకర్, హరిచంద్, యాకసాయిలు, మనోజ్ పాల్గొన్నారు.



ఇనుగుర్తి పెద్దబస్టాండ్‌లో రాస్తారోకో నిర్వహిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

ముగిసిన సీఎం కప్ క్రీడలు

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ మండలం రెడ్యాల గిరిజన ఆశ్రమ బాలుర ఉన్నత పాఠశాలలో మంగళవారం సీఎం కప్ మండలస్థాయి క్రీడాపోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ముఖ్యఅతిథిగా జడ్పీ సీఈవో పురుషోత్తం క్రీడాకారులను పరిచయం చేసుకున్న అనంతరం క్రీడా పోటీలు ప్రారంభించారు. ఈ సందర్భంగామాట్లాడుతూ విద్యార్థులు చదువుతోపాటుకు క్రీడల్లో కూడా రాణించాలని సూచించారు. ఈ పోటీల్లో కబడ్డీ 6 జట్లు, ఖో-ఖో 6 జట్లు, వాలీబాల్ 3 జట్లతో పాటు అథ్లెటిక్స్ క్రీడాకారులు పాల్గొన్నట్లు తెలిపారు. ఈ పోటీల్లో ఉత్తమ ప్రతిభ కనబరిచిన 50 మంది క్రీడాకారులను జిల్లాస్థాయి పోటీలకు ఎంపిక చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం సక్రునాయక్, ఎంపీడీవో రఘుపతిరెడ్డి, పీడీ మోహన్‌నాయక్, పీఈటీలు శ్రీనివాస్, వెంకటేశ్వర్లు, ఇస్మాయిల్, పంచాయితీ కార్యదర్శులు విక్రం, శ్రీలత, నరేష్, ఉపాధ్యాయులు వెంకన్న, లక్ష్మయ్య, రాజు, సంధ్యారాణి, పూల్య, లక్ష్మీదేవి పాల్గొన్నారు.



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న పురుషోత్తం

తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం



బొమ్మకల్లులో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



పార్లమెంట్ వద్ద నిరసనలో పాల్గొన్న ఎంపీ బలరాంనాయక్

ప్రధాని నరేంద్రమోదీ, అదానీ ఒక్కటే

పార్లమెంట్ ఆవరణలో ఇండియా కూటమి ఎంపీల నిరసన

మహబూబాబాద్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రధాని మోదీ, ఆదానీ ఒక్కటేనంటూ టీషర్ట్‌పై వారి ఫొటోలను ముద్రించి.. న్యూఢిల్లీలో పార్లమెంట్ ఆవరణలో మంగళవారం ఇండియా కూటమి ఎంపీలతో కలిసి మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యుడు పోరిక బలరాంనాయక్ మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. ఆదానీ గ్రూప్ అవినీతి అంశంపై పార్లమెంట్‌లో చర్చించాలని పార్లమెంట్ ఆవరణలో ఇండియా కూటమి ఎంపీలు ఆందోళన చేపట్టారు. ఇందులో ప్రధాని మోదీ, ఆదానీ ఒక్కటేనంటూ వారి ఫొటోలతో కూడిన టీషర్ట్‌ను చూపుతూ ఎంపీ ధర్నాలో పాల్గొన్నారు.

వాట్సాప్.. గప్‌చుప్..

- చర్చనీయాంశంగా 'బేరాల బదిలీలు' కథనం
- వాట్సాపుల్లో మెసేజ్‌లు తొలగిస్తున్న టీచర్లు

వరంగల్ ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): గుమ్మడి కాయ దొంగలు భుజాలు తడుముకున్నట్లు పరస్పర బదిలీల ఏజెంట్లు సర్దుకుంటున్నారు. మంగళవారం 'ఆంధ్రజ్యోతి'లో 'బేరాల బదిలీలు' శీర్షికన ప్రచురితమైన కథనం ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఉపాధ్యాయ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. ఉదయం నుంచే పరస్పర బదిలీల ఆశావహులు ఉపాధ్యాయుల వాట్సాప్ గ్రూపుల్లో పోస్టులు తీసేస్తున్నట్లు ఉపాధ్యాయులు చెప్పుకుంటున్నారు. ఇక ఏజెంట్లుగా అవతారమెత్తిన కొంతమంది ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు, డీఈవో కార్యాలయాల్లో పనిచేస్తున్న వారు ఆ మాట ఎత్తడం లేదని తెలిసింది. ఇక ఫైనాన్స్ చేసేందుకు సిద్ధమవుతున్న మరికొందరు వెన్నుతడుముకుంటున్నట్లు తెలిసింది. మొత్తంగా ఆంధ్రజ్యోతి కథనంతో అందరూ అప్రమత్తమ వుతున్నారనే చర్చ ఉమ్మడి జిల్లా విద్యాశాఖలోనే కాకుండా పక్క జిల్లాలైన కరీంనగర్, ఖమ్మంలోనూ ఉందని ఉపాధ్యాయ వర్గాలు చెబుతున్నారు. అలాగే ఏజెంట్లను, వాట్సాప్ పోస్టులను, ఫైనాన్షియర్లను కొంత మేరకు కట్టడి చేసిందనే అభిప్రాయాన్ని ఉపాధ్యాయ వర్గాలు వెల్లడిస్తున్నాయి.

డాక్టర్లు, సిబ్బందిని నియమించాలి : సీపీఎం

గార్ల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : పినిరెడ్డిగూడెంలోని పల్లె దవఖానలో మందులు అందుబాటులో ఉంచాలని, ఆస్పత్రిలో సరిపడ సిబ్బందిని నియమించాలని సీపీఎం జిల్లా నాయకుడు కుందునూరి శ్రీనివాస్ డిమాండ్ చేశారు. మంగళవారం స్థానికులతో కలిసి పినిరెడ్డిగూడెంలోని పల్లె దవఖాన ఎదుట ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రూ.16 లక్షలతో నిర్మించిన పల్లె దవఖానలో డాక్టర్లు, సిబ్బందిని ప్రభుత్వం కేటాయించలేదన్నారు. బీపీ షుగర్, సీజనల్ వ్యాధుల నివారణకు సంబంధించిన మందులు లేకపోవడంతో బాధితులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. ఇప్పటికైనా ప్రజలకు అన్నిరకాల మందులను అందుబాటులో ఉంచాలన్నారు. ఈ మేరకు డిమాండ్‌లతో కూడిన వినతిపత్రాన్ని మండల వైద్యాధికారి రాజ్‌కుమార్ జాదవ్‌కు అందించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం మండల కార్యదర్శి అలవాల సత్యవతి, నాయకులు వంగూరి పెద్ద వెంకటేశ్వర్లు, మల్లెల నాగమణి, కొండలయ్య, వీరభద్రం, బాల, సీతారామ్, పద్మ, నరేష్, కొండయ్య, ఉపేందర్ పాల్గొన్నారు.



పల్లె దావఖాన ఎదుట ధర్నా చేస్తున్న సీపీఎం కార్యకర్తలు

తెలంగాణ ఉద్యమ ద్రోహి రేవంత్

- రాష్ట్రంలో దుర్మార్గపు పాలన కొనసాగుతోంది
- బతుకమ్మను తొలగించి మహిళల మనోభావాలను దెబ్బతీశారు
- మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు

దేవరుప్పుల, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ రాష్ట్రం కోసం రాజీనామాలు చేస్తే రేవంత్‌రెడ్డి మాత్రం రాజీనామా చేయకుండా ఉద్యమ ద్రోహిగా మిగిలి పోయాడని మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆరోపించారు. మంగళవారం తెలంగాణ తల్లివిగ్రహ రూపురేఖలను మార్చడాన్ని ఖండిస్తూ మండలంలోని సీతారాంపురంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో భాగంగా తెలంగాణ ఉద్యమ కారులను శాలువాలతో ఘనంగా సన్మానించారు. దయాకర్‌రావు మాట్లాడుతూ తెలంగాణ తల్లి విగ్రహంలో ఆడపడుచులకు అతి పెద్ద పండుగ బతుకమ్మను తొలగించడం విడ్డూరంగా ఉందన్నారు.

నాడు ఎమ్మెల్యేగా ఉన్న రేవంత్‌రెడ్డి నాడు సోనియాగాంధీని బలిదేవతగా వర్ణించి, నేడు ఆమెనే తెలంగాణ తల్లిగా వర్ణించడం సిగ్గుచేటన్నారు. అనంతరం సీతారాం పురంలోని ప్రేమ సదన్ అనాథ శరణాలయంలోని వృద్ధులకు దుప్పట్లను బీఆర్ఎస్ నాయకుల సమక్షంలో పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ జిల్లా నాయకుడు పల్లా సుందర్‌రాంరెడ్డి, మండల అధ్యక్షుడు తీగల దయాకర్, మాజీ అధ్యక్షుడు బస్వ మల్లేశం, నాయకులు యేల సుందర్, వంగ అర్జున్, కూతాటి నరసింహులు, జేరిపోతుల సాయిలు, రాంసింగ్, గండిపెల్లి యాకయ్య తదితరులు పాల్గొన్నారు.

● పాలకుర్తి: రాష్ట్రం ఏర్పడ్డ తర్వాత తెలంగాణ సమాజం ఏర్పాటు చేసిన విగ్రహాన్ని తొలగించి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఏర్పాటు చేసిన విగ్రహంలో బతుకమ్మకు బదులు చేతి గుర్తును ఏర్పాటు చేయడం తో తెలంగాణ ఆత్మగౌరవాన్ని దెబ్బతీశారని మాజీ మంత్రి దయాకర్‌రావు విమర్శించారు. దర్దెపల్లిలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం నిర్వహించి నిరసన తెలిపారు. కార్యక్రమంలో నాయకులు పసునూరి నవీన్, మాచెర్ల ఎల్లయ్య, ఎఫ్ఎస్‌సీఎస్ అశోక్‌రెడ్డి, కారుపోతుల వేణు, పోశాల వెంకన్న, కర్ణాకర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

● కొడకండ్ల: తెలంగాణ తల్లి విగ్రహం మార్చడం సీఎం రేవంత్‌రెడ్డి మూర్ఖత్వమని దయాకర్‌రావు ఆరోపించారు. తెలంగాణ తల్లి రూపురేఖలు మార్చినందుకు కొడకండ్లలో నిరసన వ్యక్తం చేశారు. తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. మొదటి నుంచి రేవంత్ తెలంగాణ ద్రోహి అంటూ ధ్వజమెత్తారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు రామోజీ, డీఏ గాంధీనాయక్, చెంచు రాజిరెడ్డి, డి.వెంకటేశ్వర్‌రావు, ఎం వెంకటనారాయణ, విజయమ్మ, షన్ను, డీ సతీష్, డి.మహేష్, సోమరాములు పాల్గొన్నారు.



సీతారాంపురంలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న ఎర్రబెల్లి

బీసీ యువజన నాయకుల కలెక్టరేట్ ముట్టడి

జనగామ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ బీసీ సంక్షేమ, యువజన సంఘం నాయకులు మంగళవారం నిరసన వ్యక్తం చేశారు. సంఘ అధ్యక్షుడు పండుగ హరీశ్ ముదిరాజ్ అధ్వర్యంలో నెహ్రూపార్కు నుండి కలెక్టరేట్ వరకు విద్యార్థులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించి కలెక్టరేట్ ముట్టడి చేశారు. అనంతరం ఏవో మున్సూరీకి వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా జిల్లా కార్యనిర్వాహక అధ్యక్షుడు చిర్ర వీరస్వామి, హరీశ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పెండింగ్లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లను వెంటనే విడుదల చేయాలని, కళాశాలలో చదివే విద్యార్థులకు యేడాది రూ. 20,000 స్కాలర్‌షిప్‌లను మంజూరు చేయాలని, విదేశాల్లో చదివే విద్యార్థులకు రూ. 20లక్షలు మంజూరు చేయాలని, బీసీ కళాశాల హస్టళ్లు, గురుకుల పాఠశాలకు స్వంత భవనాలు నిర్మించాలని, బీసీ స్టడి సర్కిల్ బడ్జెట్‌ను రూ.200 కోట్లకు పెంచాలని, ఇతర సమస్యలను వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో నిమ్మల కుమార్, పిట్టల రజినీకాంత్, పసునూరి రంజిత్, బోళ్ల రాజ్‌కుమార్, నీల సాంబరాజు, దాసరి అజయ్, పిట్టల నవీన్ తదితరులు పాల్గొన్నారు.



జనగామ కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న బీసీ యువజన నాయకులు

సమ్మెకు దిగిన సమగ్ర శిక్ష ఉద్యోగులు



కలెక్టరేట్ ఎదుట దీక్ష చేస్తున్న సమగ్ర శిక్ష ఉద్యోగులు

జనగామ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): సమగ్ర శిక్ష ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ ఉద్యోగులు సమ్మె బాట పట్టారు. ఉద్యోగులు విధులను బహిష్కరించి మంగళవారం కలెక్టరేట్ కార్యాలయం ముందు రిలే నిరాహారదీక్షలు చేపట్టారు. ఈ సందర్భంగా సంఘ జిల్లా అధ్యక్షుడు తాడూరి రమేశ్ మాట్లాడుతూ సమగ్ర శిక్ష ఉద్యోగులందరిని రెగ్యులర్ చేయాలని, పే స్కేల్ ఇవ్వాలని, జీవిత బీమా రూ. 10లక్షలు, ఆరోగ్య బీమా రూ.10లక్షలు, పదవి విరమణ పొందిన ఉద్యోగికి రూ 25లక్షలు, పీటీఐలకు పెండింగ్‌లో ఉన్న 12 నెలల వేతనం, మహిళ ఉద్యోగులకు వేతనంతో కూడిన ప్రసూతి సెలవులు, ఇతర సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన మాట ప్రకారం తమ సమస్యలను పరిష్కరించకపోతే పెద్ద ఎత్తున ఆందోళనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో బైరగొని దయాకర్, గోలి రవీందర్‌రెడ్డి, గోరంట్ల యాదగిరి, వెంకటేశ్వర్లు, రాణి, అన్నపూర్ణ, రొయ్యల రాజు, మహాలక్ష్మి, దిలీప్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఎంజీఎంలో ఉద్యోగుల నిరసన

వరంగల్ మెడికల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): ఇటీవల బలవన్మరణానికి పాల్పడిన ఎస్‌టీఎల్ఎస్ భరత్ కోసం ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు రాష్ట్రవ్యాప్తంగా నిరసన తెలిపారు. మంగళవారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు నల్లబ్యాడ్జీలు ధరించి ఎంజీఎం ఆస్పత్రిలో నిరసన వ్యక్తం చేశారు. జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ మెంబర్ ఎస్‌టీఎల్ఎస్ నిర్మల్ జిల్లాలో ఆత్మహత్య చేసుకున్న భరత్‌కు రావాల్సిన బెనిఫిట్స్, రూ.10లక్షల ఎక్స్‌గ్రేషియా, పీఎఫ్, ఇతర బకాయిలను ప్రభుత్వం అందించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా జాతీయ ఆరోగ్య మిషన్ కాంట్రాక్టు అండ్ ఔట్‌సోర్సింగ్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామ రాజేష్‌ఖన్నా మాట్లాడుతూ.. ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగి ఆత్మహత్య సంఘటనలు పునరావృతం కాకుండా ప్రభుత్వం, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని కోరారు. మానవతా దృక్పథంతో ఆలోచన చేసి ఉద్యోగులకు ఉద్యోగ భద్రత కల్పించాలన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ నూర సంపత్‌కుమార్, పలువురు ఎన్‌హెచ్‌ఎం కాంటాక్టు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వం రైతు పక్షపాతి



గుర్తూర్‌లో ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న తిరుపతి రెడ్డి

తొర్రూరు రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ ప్రభుత్వం రైతుపక్షపాతి అని తొర్రూరు వ్యవసాయ మార్కెట్ చైర్మన్ హనుమాండ్ల తిరుపతిరెడ్డి అన్నారు. మంగళవారం గుర్తూర్‌లో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులకు ఇబ్బందులు కలుగకుండా నిర్వాహకులు చర్యలు తీసుకోవాలని సూచించారు. రైతు సంక్షేమం కోసం అన్నివిధాలుగా కాంగ్రెస్ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. మండల పార్టీ అధ్యక్షుడు సుంచు సంతోష్, పట్టణ అధ్యక్షుడు సోమ రాజశేఖర్, లింగాల వెంకటనారాయణగౌడ్, మాజీ వైస్‌ఎంపీపీ ఇట్టె శ్యాంసుందర్ రెడ్డి, మాచర్ల అరవింద్‌గౌడ్, దేవేందర్‌రాజు, ముద్దం మహబూబాబాద్‌రెడ్డి, దేవరకొండ కృష్ణప్రసాద్ పాల్గొన్నారు.

వసతి గృహాల్లో పరిశుభ్రత పాటించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ నాగేశ్వర్‌రావు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : సాంఘిక సంక్షేమ వసతి గృహాల్లో పరిశుభ్రతలను పాటించాలని ప్రోగ్రాం ఆఫీసర్లు డాక్టర్ సారంగపాణి, డాక్టర్ నాగేశ్వర్‌రావు అన్నారు. మహబూబాబాద్ ప్రభుత్వ బాలుర సాంఘిక సంక్షేమ వసతి గృహంలో జిల్లా వెనుకబడిన తరగతుల అభివృద్ధి శాఖ, షెడ్యూల్ కులాల అభివృద్ధి శాఖల ఆధ్వర్యంలో జిల్లా వైద్యఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ మురళీధర్ ఆదేశాల మేరకు వసతి గృహ అధికారులు, నాలుగవ తరగతి ఉద్యోగులకు వ్యక్తిగత పరిశుభ్రత, గృహ పరిశుభ్రత నిర్వహణపై మంగళవారం శిక్షణ శిబిరాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ హాస్టళ్లలో పరిశుభ్రతతో పాటు వ్యక్తిగత పరిశుభ్రత ముఖ్యమని చెప్పారు. హాస్టళ్లలో ఉన్న పిల్లలు ఆరోగ్యంగా ఉండాలంటే ఆహారం తీసుకున్నాక చేతులు శుభ్రంగా కడుక్కోవాలన్నారు. మెనూ ప్రకారం భోజనం అందించాలని చెప్పారు. వంటచేసే సమయంలో వంట పాత్రలు శుభ్రంగా కడగాలని తెలిపారు. ఆహార పదార్థాలు నిల్వ ఉంచే ప్రదేశాలు పరిశుభ్రంగా ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. కిటికీలకు మెస్ కొట్టాలన్నారు. బీసీ వెల్ఫేర్ అధికారి నర్సింహాస్వామి, మైనార్టీ సంక్షేమ శాఖ అధికారి శ్రీనివాసరావు, వైద్య సిబ్బంది కేవీ. రాజు, పురుషోత్తం, మహేశ్వరీ, కిరణ్మయి, దీపిక, ఉమారాణి పాల్గొన్నారు.

పుష్కరాలకు వెళ్లే భక్తులకు గుడ్ న్యూస్

జనగామ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మహ కుంభ మేళా (ఉత్తరప్రదేశ్) వెళ్లే భక్తులను ఐఆర్‌సీటీసీ స్పెషల్ టూరిజం ప్యాకేజీని ఇస్తున్నట్లు ఐఆర్‌సీటీసీ ఎగ్జిక్యూటీవ్ టూరిజం అధికారి పవన్ కుమార్ సెంగర్ తెలిపారు. జనగామ రైల్వే స్టేషన్‌లో ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు మంగళవారం పుష్కరాలకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించి విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. హిందువులు ఎంతో పవిత్రంగా భావించే మహా కుంభమేళా జనవరి 13 నుంచి ఫిబ్రవరి 16 వరకు జరుగుతుందన్నారు. 12 సంవత్సరాలకు ఒక్కసారి వచ్చే పుష్కరాల సందర్భంగా భక్తులు ఎలాంటి ఇబ్బందులు కల్గకుండా ఐఆర్‌సీటీసీ ఆధ్వర్యంలో భారత్ గౌరవ్ యాత్ర పేరిట ప్రత్యేక రైలును ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ఈ రైలు జనవరి 19న సికింద్రాబాద్‌లో ప్రారంభమై మహాకుంభమేళా ప్రయోగరాజ్, కాశి, అయోధ్య రామ మందిరం, ఇతర పుణ్యక్షేత్రాలను దర్శించుకోని తిరిగి జనవరి 26న సికింద్రాబాద్ చేరుకుటుందన్నారు.

ఏడు రాత్రులు 8 రోజుల పాటు సాగే ప్రయాణంలో ప్రయాణికులకు వసతి, భోజనం, రక్షణ సిబ్బంది ఏర్పాటు చేయడం జరుగుతుందన్నారు. స్లీపర్ ప్రయాణికులకు రూ. 22,635, థర్డ్ ఏసీ ప్రయాణికులకు రూ. 31,145, సెకండ్ ఏసీ ప్రయాణికులకు రూ.38,195 చార్జీలను వసూల్ చేస్తున్నామని తెలిపారు. జనగామ రైల్వే స్టేషన్‌లో కూడా ట్రైన్ హాల్టింగ్ ఉందని, కావున ఈ అవకాశాన్ని జనగామ జిల్లా ప్రజలు సద్వినియోగం చేసుకోగలరన్నారు. ఇతర వివరాల కోరకు 9701360701, 9281495845 నంబర్లును సంప్రదించాలని తెలిపారు. కార్యక్రమంలో సేల్స్ మార్కెటింగ్ ఇన్‌చార్జి నరేశ్ బాబు, టీమ్ లీడర్ ప్రశాంత్, రైల్వే స్టేషన్ బుకింగ్ అధికారి అనిల్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.



కరపత్రాలను ఆవిష్కరిస్తున్న ఐఆర్‌సీటీసీ ప్రతినిధులు

ఆశ్రమ పాఠశాలల్లో

జీసీడీవో విచారణ



విచారణ చేసి బయటకు వస్తున్న జీసీడీవో సుగుణ

నెహ్రూసెంటర్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల, ముత్యాలమ్మగూడెం, గూడూరు గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలల్లో ఏటూరునాగారం జీసీడీవో పెనుక సుగుణ మంగళవారం విచారణ చేపట్టారు. డిసెంబరు 6న 'ఆంధ్రజ్యోతి' జిల్లా టాబ్లాయిడ్‌లో 'హాస్టళ్లలో మేం ఉండలేం' శీర్షికతో ప్రచురితమైన కథనానికి ఐటీడీఏ అధికారులు స్పందించారు. జిల్లాలోని పలు గిరిజన ఆశ్రమ పాఠశాల్లో ఏటూరు నాగారం జీసీడీవో సుగుణ సందర్శించి అక్కడ విద్యార్థులతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. విద్యార్థినులకు రక్షణ కల్పించాలని, తక్షణమే సీసీ కెమెరాలు పనిచేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. హాస్టల్ వార్డెన్లు 24 గంటలు అందుబాటులో ఉండాలని, పిల్లలు భయభ్రాంతుల కు గురైతే వార్డెన్లు బాధ్యత వహించాల్సి ఉంటుందన్నారు. హాస్టళ్ల పరిసర ప్రాంతాల్లో సంచరించే పోకిరీల పట్ల తగు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ విచారణకు సంబంధించిన పూర్తి నివేదికను ఐటీడీఏ పీవోకు అందజేస్తామని చెప్పారు.

ఆంధ్రజ్యోతి ఎఫెక్ట్

అనంతరం బాధ్యులపై చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఏటీడీవో దేశీరాంనాయక్, మహబూబాబాద్ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల హెచ్‌ఎం పొడుగు నర్సయ్య పాల్గొన్నారు. ఇది ఇలా ఉండగా మానుకోట గిరిజన ఆశ్రమ పాఠశాల, ముత్యాలమ్మగూడెం, గూడూరు గిరిజన బాలుర ఆశ్రమ పాఠశాలల హెచ్‌ఎం, వార్డెన్లను ఏటూరునాగరం ఐటీడీఏ కార్యాలయానికి పిలిపించినట్లు సమాచారం.


విద్యుదాఘాతంతో ఒకరి మృతి

డోర్నకల్ డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ఫకీరాతండా జీపీ శివారు తులిశ్యతండాకు చెందిన బి.సుక్యా (47) మంగళవారం రాత్రి విద్యుత్ షాక్‌తో తన ఇంటి వద్ద మృతి చెందాడు. ప్రత్యక్ష సాక్షులు తెలిపిన వివరాల ప్రకారం.. సుక్యా వ్యవసాయ కూలీగా పని చేస్తున్నాడు, మంగళవారం రాత్రి పనులు ముగించుకొని ఇంటికి వచ్చి స్నానం చేసిన తర్వాత ఇనుప దండెం తీగపై ఉన్న కండువా తీస్తుండగా, విద్యుత్‌షాక్ గురై అక్కడికక్కడే మృతి చెందాడు. సుక్యా భార్య ఇటీవలే చనిపోయింది. మృతుడికి కుమారుడు, కుమార్తె ఉన్నారు.

ప్రభుత్వ భూమి అమ్మిన వ్యక్తిపై కేసు

డోర్నకల్ డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండల పరిధిలోని ములకలపల్లికి చెందిన ఓ వ్యక్తి ప్రభుత్వ భూమిని సొంతభూమి అంటూ అమ్మి మోసానికి పాల్పడ్డఘటనలో ఒకరిపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై వంశీధర్ మంగళవారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం.. ములకలపల్లి చెందిన చెన్నేబోయిన అంజనేయులు భద్రాద్రి కొత్తగూడెం జిల్లా బుర్గంపాడు మండలం ఇరవెండికి చెందిన కాసబోయిన సతీష్‌కు రెండుఎకరాల భూమిని ఇటీవల అమ్మాడు. సతీష్ వద్ద ముందుగా డబ్బులను సైతం తీసుకొన్నాడు. భూమిని సర్వే చేయించగా అందులో 17 గుంటలు ప్రభుత్వ భూమి ఉన్నట్లు రెవెన్యూ అధికారులు తేల్చారు. దీంతో ప్రభుత్వ భూమిని తనకు అమ్మి అంజనేయులు మోసానికి పాల్పడ్డాడని గుర్తించిన సతీష్ తన డబ్బులు తనకు తిరిగి ఇవ్వాలని అంజనేయలును కోరాడు. ఆయినా అతను ఖాతరు చేయకపోవడంతో సతీష్ డోర్నకల్ పీఎస్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు అంజనేయులుపై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

తల్లి మృతి చెందిందని మనోవేదనతో కొడుకు ఆత్మహత్య



కాళిదాస్ (ఫైల్)

కేసముద్రం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : తల్లి మృతి చెందిందని మనోవేదనతో నాలుగు నెలల అనంతరం కొడుకు ఆత్మహత్య చేసుకున్న ఘటన కేసముద్రం మండలం అమినాపురంలో మంగళవారం చోటు చేసుకుంది. ఎస్ఐ మురళీధర్‌రాజ్ తెలిపిన ప్రకారం.. అమినాపురానికి చెందిన మహేశ్వరం వేణుమాధవ్-విజయలక్ష్మి దంపతులకు ఇద్దరు కుమారులు. విజయలక్ష్మి నాలుగు నెలల క్రితం అనారోగ్యంతో మృతి చెందగా అప్పటి నుంచి చిన్నకుమారుడైన మహేశ్వరం కాళిదాసు(30) తీవ్ర మనోవేదనలో అన్నం సరిగా తినకుండా బాధపడుతూ ఉంటున్నాడు. ఈ క్రమంలో తెల్లవారుజామున లేచి చూసేసరికి ఇంట్లో తన గదిలో కాళిదాసు ఉరివేసుకుని కనిపించాడు. తల్లిపై బెంగతోనే అవివాహితుడైన తన కుమారుడు మృతి చెందినట్లు వేణుమాధవ్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

దొంగను పట్టిచ్చిన సీసీ కెమెరా

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : జిల్లా కేంద్రంలోని హన్మంతరావు స్థూపం సమీపంలోని శ్రీకాంత్ మెడికల్ అండ్ జనరల్ స్టోర్స్‌లో సోమవారం రాత్రి చోరీ జరిగింది. ఈ దృశ్యాలు సీసీ కెమెరాలో రికార్డయ్యాయి. క్లూస్ టీం, పోలీసులు సీసీ కెమెరాలను పరిశీలించి నిందితుడిని గుర్తించారు. మహబూబాబాద్ టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీకాంత్ జనరల్ అండ్ మెడికల్ స్టోర్‌లో సోమవారం రాత్రి షటర్‌ను పగులగొట్టి కౌంటర్‌లో ఉన్న రూ. 6 వేల నగదు, కొంత మెడిసిన్‌ను తీసుకువెళ్లినట్లు తెలిపారు. సీసీ కెమెరాలను పరిశీలించగా..

వరంగల్ జిల్లా నెక్కొండ మండలం పెద్దనాగారానికి చెందిన బానోత్ దస్రూగా గుర్తించినట్లు చెప్పారు. చోరీ చేసిన నగదుతో మద్యం తాగి, గాయత్రి గుట్టపై ఉన్న ట్లు గుర్తించామని తెలిపారు. అతడిని అదుపులోకి తీసుకొని విచారించగా నేరాన్ని ఒప్పుకున్నట్లు చెప్పారు. బాధితుడు శ్రీకాంత్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.



మెడికల్ స్టోర్ వద్ద ఏర్పాటు చేసిన సీసీ కెమెరా

చరిత్ర

790 ఏళ్ల కోటగుళ్లు



గణపురం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కోటగుళ్లు.. 790ఏళ్ల చరిత్రకు నిదర్శనం. అద్భుత శిల్ప సంపదకు ఆలవాలం. అలాంటి ఎంతో చరిత్ర గలిగిన కోటగుళ్లలోని గణపతి దేవాలయం నిరాదరణకు గురవుతోంది. కళా సంపద కనుమరుగవుతోంది. గణపతిదేవ చక్రవర్తి ఏలిన ఈ గడ్డపై ఆలయంతో పాటు పెద్ద చెరువు నిర్మాణంతో తమ జీవితం బాగానే ఉన్నా అద్భుత కళా సంపద అంతరించిపోతుండడంతో అసంతృప్తికి గురిచేస్తోంది. ప్రభుత్వాలు మారినా.. ఇక్కడి పరిస్థితి మాత్రం మారడం లేదన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. దశాబ్దం క్రితం పరిశీలనలు జరిపిన పురావస్తుశాఖ అధికారులు ఆలయాన్ని బాగును మరిచారు. ఈ లోపే హరితహోటల్‌ను నిర్మించి ఆలయ అభివృద్ధిని గాలికి వదిలేశారు. ఓరుగల్లును రాజధానిగా చేసుకుని ఘనంగా పాలించిన కాకతీయ చక్రవర్తుల్లో అగ్రగణ్యుడైన గణపతిదేవ చక్రవర్తి పేరున క్రీస్తుశకం 1234లో గణపురం (గణపవరం), గణపేశ్వరాలయం(కోటగుళ్లు), గణపసముద్రం (చెరువు) నిర్మితమయ్యాయి. రామప్ప దేవాలయాన్ని నిర్మించిన కాకతీయ సర్వసైన్యాధ్యక్షుడు రేచర్ల రుద్రారెడ్డి మూడవ కుమారుడు గణపురం సామంతుడు గణపతి రెడ్డి ఆధ్వర్యంలో ఈ నిర్మాణాలు జరగ్గా.. గణపేశ్వరాలయంతో పాటు చుట్టూ 21ఉప ఆలయాలున్నాయి. దాంతో ఈ ప్రాంతానికి గణపురం అని పేరు వచ్చింది. కాకతీయ చక్రవర్తులు తమ సామ్రాజ్య పాలనను ప్రజలకు అందుబాటులోకి తేవడానికి ఇప్పటి మండలాల మాదిరిగా సామంత రాజ్యాలను ఏర్పరిచి.. ట్రిపుల్ టీ విధానంలో సామంత రాజ్యకేంద్రాన్ని నిర్మించారు. ట్రిపుల్ టీ.. టీ (టౌన్) నగరం, టీ(టెంపుల్) ఆలయం, టీ (ట్యాంక్) చెరువు. ఈ విధంగా సామంత రాజ్య కేంద్ర నిర్మాణ క్రమంలో నగరాన్ని నిర్మించారు. ఆ నగరంలో ఒక దేవాలయాన్ని, ఒక చెరువును నిర్మించేవారు. ఈ ట్రిపుల్ టీ విధానంలోనే అప్పుడు గణపురం సామంతరాజ్య కేంద్రంగా ఏర్పాటు చేసి గణపురం పేరుతో నగరం, గణపేశ్వరాలయం పేరున ఆలయం, గణపసముద్రం పేరుతో పెద్ద చెరువును నిర్మించారు. ఇంత చరిత్ర ఉన్నా అభివృద్ధికి నోచుకోని ఈ ఆలయ సముదాయాన్ని కేంద్ర ప్రభుత్వం ఇటీవల స్పెషల్ అసిస్టెంట్ టు స్టేట్ ఫర్ కాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (సాస్కీ) పథకానికి ఎంపిక చేయడం ఊరటనిచ్చే అంశం.

- గణపతిదేవ చక్రవర్తి పేరిట ఏర్పడిన గణపురం
- ట్రిపుల్ టీ విధానంతో ఈ ప్రాంత నిర్మాణం
- అద్భుతశిలా సంపదకు ఆదరణ లేక ఆగం
- ఘనమైన చరిత్ర ఉన్నా అభివృద్ధి శూన్యం
- సాస్కీ పథకానికి ఎంపికతో కాస్త ఊరట

ఆలయాభివృద్ధిని ఏళ్ల తరబడి సాగదీత

సింటెక్ టెక్నాలజీతో గణపురం కోటగుళ్లను పునరుద్ధరిస్తామని చెప్పిన పురావస్తు అధికారులు అభివృద్ధిని మరిచారు. కేంద్ర ప్రభుత్వం నుంచి 13వ ఆర్థిక కమిషన్ నిధుల ద్వారా రూ.2కోట్లు మంజూరైనట్లు సమాచారం.. 13వ ఆర్థిక కమిషన్ నిధుల ద్వారా మొదటి విడతగా రూ.35లక్షలు మంజూరు చేయగా కొన్ని ఉప ఆలయాలను పునరుద్ధరించి మిగిలిన ఆలయాల శిథిల భాగాలను అలాగే వదిలేశారు. అప్పటినుంచే ఆలయ పునరుద్ధరణ ఆగిపోయింది. ఇప్పటివరకు మరిన్ని నిధుల మంజూరులో జాప్యం జరుగుతుందంటూ అధికారులు సాగదీస్తున్నారు. ఈ క్రమంలో కేంద్ర ప్రభుత్వం ఇటీవల స్పెషల్ అసిస్టెంట్ టు స్టేట్ ఫర్ కాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (సాస్కీ) పథకానికి ఈ చారిత్రక కట్టడాన్ని ఎంపిక కేసింది. రామప్ప ఆలయంతో పాటు గణపురంలోని కోటగుళ్లు, గణప సముద్రం సరస్సు, రామప్ప సమీపంలోని ఇంచర్ల గ్రామాన్ని ఈ పథకం కింద అభివృద్ధి చేయను న్నారు. ఇందుకు కేంద్ర పర్యాటక శాఖ రూ. 73.74 కోట్లు మం జూరు చేస్తూ ఉత్తర్వులు ఇవ్వడంతో కోటగుళ్లకు కొత్త రూపు రానుంది.

ఆలయ అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ వహిస్తాం..

గండ్ర సత్యనారాయణరావు, భూపాలపల్లి ఎమ్మెల్యే



కోటగుళ్ల అభివృద్ధికి ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటాం. కాకతీయుల కళా సంపదను కాపాడి తీరుతాం. ఇక్కడ ఉన్న రెడ్డి గుడి, కోటగుళ్ల శిల్పాకళా సంపదకు పూర్వ వైభవం తెచ్చేలా కృషి చేస్తాం. గత ప్రభుత్వాల నిర్లక్ష్యం కారణంగా ఈ దేవాలయ సముదాయం నిరాదరణకు గురైంది. పురావస్తు శాఖ అధికారులతో సమీక్షా సమావేశం ఏర్పాటు చేసి అభివృద్ధి కోసం ప్రత్యేక ప్రణాళిక రూపొందించి పర్యాటక కేంద్రంగా తీర్చిదిద్దుతాం.

నాట్య ప్రదర్శనలకు నిలయంగా...

కాకతీయుల కాలంలో కోటగుళ్ల ఆలయ సముదాయంలో నిత్య ధూపదీప నైవేద్యాలతో అలారేది. నాడు 60ఎకరాల మాగాణి భూమిని సామంతరాజు గణపతిరెడ్డి దానంగా ఇచ్చి అందులో వచ్చే పంటలో ఆదాయాన్ని వినియోగించుకున్నట్టు చారిత్రక ఆధారాలున్నాయి. దేవాలయంలో శివుడు పరవశించేలా 72మంది సేవలు చేసేవారని, నిత్యం ఆలయ మండపంలో ఒక నర్తకి, 16మంది వాయిద్య కారులతో నాట్య ప్రదర్శనలు, సంకీర్తనలు నిర్వహించేవారని చెబుతుంటారు. ఆలయానికి దక్షిణంవైపున్న 60స్తంభాల మండపాన్ని రంగ మండపంగా పిలిచేవారని, ఈ మండపంలో వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు, విజ్ఞాన, సంగీత, సాహిత్య కవి సమ్మేళనాలు నిర్వహించేవారని తెలుస్తోంది.

ధ్వంసం చేసిన ఢిల్లీ మహ్మదీయ సైన్యం

గణపేశ్వరాలయ ప్రాంగణంలో రుద్రమదేవి, ప్రతాపరుద్ర చక్రవర్తులకు చెందిన నాయంకర సైన్యంతో పాటు 2వేల అశ్విక సైన్యాన్ని పోషించేవారట. క్రీ.శ: 1323లో కాకతీయుల చివరి చక్రవర్తి ప్రతాపరుద్రుడి కి- ఢిల్లీ మహ్మదీయులకు జరిగిన యుద్ధంలో ప్రతాపరుద్రుడి మరణంతో గణపేశ్వరాలయం వైభవాన్ని కోల్పోయింది. ఓరుగల్లుపై దండయాత్రలకు ఢిల్లీ మహ్మదీయ సైన్యం కరీంనగర్ జిల్లా కాళేశ్వరం ప్రాంతంలోని గోదావరి నది దాటుతూ ఓరుగల్లుకు వెళ్లే మార్గంలో ఉన్న కాకతీయ సంపదలైన గుడులు, చెరువులు, కట్టడాలను ధ్వంసం చేసింది. ఈ క్రమంలోనే గణపేశ్వరాలయ సముదాయాన్ని కూడా ధ్వంసం చేసి.. గణపసముద్రానికి గండి పెట్టి ప్రజల ఆస్తులను దోచుకున్నారని చరిత్ర చెబుతోంది. ఇక క్రీ.శ. 1504నుంచి 1512వరకు ఓరుగల్లును పాలించిన షితాబుఖాన్ అనే సీతాపతి రాజు మహమ్మదీయుల కంటపడి విధ్వంసం కాకుండా కాపాడి భూమిలో పూడ్చిన 8అడుగుల శివ, విష్ణువు ద్వార పాలకుల విగ్రహాలు, రాజనర్తకీ, సూర్యభగవానుల విగ్రహాలు తవ్వకాల్లో బయటపడ్డాయి. వీటిని పురావస్తు శాఖ గణపేశ్వరాలయ ప్రాంగణంలోని హరితహోటల్ ముందు భద్రపరిచారు.

94 ఏళ్ల కింద వెలుగులోకి వచ్చిన కోటగుళ్లు

కాకతీయ చక్రవర్తి ప్రతాపరుద్రుడి అనంతరం నిరాదరణకు గురై సుమారు 696 ఏళ్లు వెలుగులోకి రాని కోటగుళ్లు నిజాం సర్కారు, పురావస్తు శాఖ డైరెక్టర్ గులాం యాజ్దాని 1930లో రామప్ప దేవాలయంతో పాటు గణపేశ్వర ఆలయాన్ని వెలుగులోకి తెచ్చారు. ఇలాంటి ఘన చరిత్ర కలిగిన గణపేశ్వరాలయానికి 2024నాటికి 790 ఏళ్లు నిండుతాయి. అయితే ఇప్పటికైనా ఆలయాల అభివృద్ధిపై వేల కోట్లు ఖర్చు చేసే కేంద్ర రాష్ట్ర ప్రభుత్వం కోటగుళ్లపై ప్రత్యేక శ్రద్ధ కనబరచాలని ఈ ప్రాంత ప్రజలు కోరుతున్నారు. అలాగే రాష్ట్ర ప్రభుత్వం కూడా ప్రత్యేక చొరవచూపాలని విజ్ఞప్తి చేస్తున్నారు.



తవ్వకాల్లో బయల్పడిన శిల్పాలు



కోటగుళ్ల చుట్టూ ఉన్న ఉప ఆలయాలు



ఆలయంలోని శివలింగాలు



తను ప్రత్యేకంగా పూజలు చేయడానికి గణపతిరెడ్డి కట్టించుకున్న రెడ్డి గుడి

కొండంత ఎత్తుకు..

కీర్తి పతాక

- పర్వతారోహణలో సత్తా చాటుతున్న యువకుడు
- బెస్ట్ మౌంటెనర్‌గా యశ్వంత్ రికార్డు
- చదువు కొనసాగిస్తూనే సాధన
- ఎవరెస్ట్ అధిరోహణే లక్ష్యంగా అడుగులు



అరుణాచల్‌ప్రదేశ్‌లోని గోరిచెన్ పర్వతంపై జాతీయ పతాకంతో యశ్వంత్ (ఫైల్)

మరిపెడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : అతనో నిరుపేద బిడ్డ. పుట్టింది మారుమూల తండాలో అయినా పర్వతారోహణతో ఖండాంతరాలను దాటుతున్నాడు. అతి చిన్న వయస్సులోనే బెస్ట్ మౌంటినర్‌గా రికార్డులు సాధిస్తున్న ఆయువకుడు.. ఓ చదువుకుంటూనే.. మరోవైపు ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడమే లక్ష్యంగా అడుగులు వేస్తున్నాడు. ఇప్పటికే యముకలు కొరికే చలిని సైతం లెక్కచేయకుండా కిలిమంజారో పర్వతాన్ని అధిరోహించి రికార్డు సృష్టించి ఔరా అనిపించాడు మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం భూక్యా తండాకు చెందిన భూక్యా యశ్వంత్. భూక్యా రామ్మూర్తి-జ్యోతి దంపతుల చిన్న కుమారుడు యశ్వంత్ మరిపెడబంగ్లాలోని గ్లోబల్ కేరళ మోడల్‌స్కూల్లో పదోతరగతి వరకు, హైదరాబాద్ ఎన్‌డీసీ కళాశాలలో ఇంటర్ పూర్తి చేశాడు. ప్రస్తుతం హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ డిగ్రీ క ళాశాలలో సెకండియర్ చదువుతున్న యశ్వంత్ ఇప్పటికే ఖండాంతరాలు దాటి పలు కఠినమైన పర్వతాలను అధిరోహించి ప్రశంసలు అందుకున్నాడు. ఇంటర్ చదివే సమయంలో కళాశాల యజమాన్యం అప్పుడప్పుడు విహార యాత్రలకు తీసుకెళ్లేవారు. ఈ క్రమంలో యశ్వంత్ భువనగిరి గుటపై సరదాగా రాక్ క్లైంబింగ్ చేస్తుండగా గమనించిన లెక్చరర్లు పర్వతరోహణకు ప్రోత్సహించారు. వారిచ్చిన ప్రోత్సాహంతో యశ్వంత్ బెస్ట్ మౌంటెనర్‌గా ఎదిగాడు.



ఆర్థిక సమస్యలున్నా వెనక్కు తగ్గకుండా..

నిరుపేద కుటుంబంలో జన్మించిన యశ్వంత్ ఆర్థిక సమస్యలతో సతమతమవుతూనే వెనకడుగేయకుండా లక్ష్య సాధనకు శ్రమిస్తున్నాడు. తండ్రి విద్యుత్ సబ్‌స్టేషన్ ఆపరేటర్, తల్లి వ్యవసాయ కూలీ. వారి ఆదాయం అంతంత మాత్రమే అయినా సమస్యలను అధిగమిస్తూ లక్ష్యం వైపు సాగుతున్నాడు. ఇప్పటివరకు పలువురి సహకారంతో ప్రపంచంలోని అనేక పర్వతాలను అధిరోహించగా.. పలు రాష్ట్రాల గవర్నర్లు, సీఎంల నుంచి ప్రశంసలందుకున్నాడు. పలువురు ఎస్పీలు ఇచ్చిన స్ఫూర్తి, దాతలు, గిరిజన అధికారులు, కు ల సంఘాల నేతలిచ్చిన ప్రోత్సాహంతో సాధన చేస్తున్నాడు.

ఏడు పర్వతాలు అధిరోహించాడు..

యశ్వంత్ 2021నుంచి ఇప్పటి వరకు ప్రపంచ వ్యాప్తంగా పేరొందిన ఏడు పర్వతాలను అవలీలగా అధిరోహించాడు. వాటిలో సౌత్‌ఆఫ్రికాలోని 5,895 మీటర్ల ఎత్తుండే కిలిమంజారోతో పాటు రష్యాలోని 5,642 మీటర్లు ఎత్తుండే ఎల్బ్రస్, నేపాల్‌లోని 5,363 మీటర్ల ఎత్తుండే ఎవరెస్ట్‌బేస్, ఆస్ట్రేలియాలోని 7,310 మీటర్లు ఉన్న ఖాసీసీజ్‌గో, లెహ్‌లోని 6,250 మీటర్లు గల ఖాంగ్‌ఎట్స్, అరుణాచల్‌ప్రదేశ్‌లోని 6,488 మీటర్లు ఎత్తుండే గోరిచెన్, హిమాచల్‌ప్రదేశ్‌లోని 6,100 మీటర్లున్న యోమాం పర్వతాలను అధిరోహించి పలు రికార్డులు నమోదు చేశాడు.

ఎవరెస్టే లక్ష్యంగా సాధన చేస్తున్నా : యశ్వంత్



ఎవరెస్ట్ శిఖరాన్ని అధిరోహించడమే లక్ష్యంగా సాధన చేస్తున్నా. సరదాగా రాక్‌క్లైబింగ్ చేస్తుండగా గమనించిన లెక్చరర్లు పోత్సహించడంతో మౌంటెనర్‌గా రాణిస్తున్నా. నాలుగేళ్లుగా ప్రఖ్యాత ట్రాన్సెండ్ అడ్వెంచర్ కంపెనీ సహకారంతో, దాతల చేయూతతో ఇప్పటికే ప్రపంచంలోని పలు కఠినతరమైన పర్వతాలను అధిరోహించా. ప్రభుత్వం నా లాంటి నిరుపేద బిడ్డలను ప్రోత్సహిస్తే జీవితాంతం రుణపడి ఉంటాం.

స్టార్ట్.. కెమెరా.. యాక్షన్!



ఏకశిల గుట్టపై సినిమా షూటింగ్

వరంగల్ మధ్యకోటలోని ఏకశిల గుట్టపై మంగళవారం 'ఓ భామా అయ్యోరామా' చిత్రం షూటింగ్ చేశారు. హీరోగా కలర్‌ఫొటో ఫేం సుహాస్, హీరోయిన్లుగా మాళవిక, నయని, పావని నటిస్తున్న ఈ చిత్రంలోని పలు సన్నివేశాలను మధ్యకోటలోని శిల్పాలు, ఏకశిల గుట్ట, గుండుచెరువు, ఏకశిల పార్కు పరిసరాల్లో చిత్రీకరించారు. 12వతేదీ వరకు వరంగల్, హనుమకొండ, జనగామ జిల్లాల్లో షూటింగ్ చేస్తామని యూనిట్ తెలిపింది. ఆనంద్ గాదెగోని నిర్మాణంలో రామ్‌గోదాల దర్శకత్వంలో ఈ చిత్రం తెరకెక్కుతోంది.

- ఖిలావరంగల్, ఆంధ్రజ్యోతి



అయ్యప్ప దేవాయ నమః

హనుమకొండ పద్మాక్షి గుట్టపై పడిపూజ.. మెట్టుగుట్టలో పంబారట్



పడిపూజలో పాల్గొన్న పద్మాక్షి అయ్యప్ప సేవ సమితి సభ్యులు, భక్తులు

హనుమకొండ చౌరస్తా, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హనుమకొండ పద్మాక్షి కాలనీలోని పద్మాక్షి గుట్టపై శ్రీపద్మాక్షి అయ్యప్ప సేవా సమితి ఆధ్వర్యంలో మంగళవారం అయ్యప్పస్వామి మహాపడిపూజ అత్యంత వైభవంగా నేత్ర పర్వంగా జరిగింది. పదాక్షి ఆలయ ప్రధాన అర్చకుడు నాగిళ్ల శంకర్‌శర్మ పర్యవేక్షణలో గురుస్వాములు కొండ శ్రీనివాస్, తుమ్మేటి బుచ్చిరాజు ఆధ్వర్యంలో ముందుగా గణపతికి ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం సుబ్రహ్మణ్యస్వామి, అయ్యప్పస్వామి విగ్రహాలకు పూజలు, పంచామృతాలతో ఘనంగా అభిషేకాలు నిర్వహించారు. పదునెట్టాంబడి పూజ, మహా మంగళ హారతి నిర్వహించగా పూజలో పాల్గొన్న అయ్యప్ప మాలధారులు భక్తిపారవశ్యంతో మునిగిపోయారు. స్వామియే శరణం అయ్యప్ప.. నామ స్మరణతో వందలాది మంది అయ్యప్పస్వామి మాలధారులు శరణుఘోషతో భక్తిని ఇనుమడింపజేసింది. దీంతో ఆ ప్రదేశం అంత పులకించిపోయింది. అనంతరం శ్రీపద్మాక్షి అయ్యప్ప సేవా సమితి సభ్యులు అయ్యప్పస్వామి మాలధారులకు మహాన్నదానం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గురు స్వాములు పోల్ లక్ష్మణ్, దప్పు శ్రీను, పెట్టం గంగాధర్, నంద నర్సయ్య, లక్షినారాయణ, సభ్యులు వరుణ్‌రెడ్డి, దొమ్మటి శ్రీకాంత్, కనుకుంట్ల రవికుమార్, దశరథకుమార్, మనోహర్, కుమారస్వామి, టి.ప్రకాష్, టి.శ్రీనివాస్ బొల్లం అశోక్, బండారి మహేందర్, నాగరాజు, సదానందం తదితరులు పాల్గొన్నారు.

మెట్టుగుట్టపై భక్తిశ్రద్ధలతో పంబారట్టు

మడికొండ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): మెట్టుగుట్టపై మంగళవారం అయ్యప్ప స్వామికి అయ్యప్ప మాలధారులు ఘనంగా పంబారట్టు నిర్వహించారు. తొలుత అయ్యప్పస్వామి ఉత్సవ విగ్రహాన్ని ప్రత్యేకంగా అలంకరించిన రథంపై ఉంచి స్థానిక వేణుగోపాలస్వామి దేవస్థానం నుంచి గ్రామ ప్రధాన రహదారుల గుండా ఆటపాటలతో ఊరేగిస్తూ మెట్టుగుట్టపైకి చేర్చారు. పాల గుండంలో స్వామి వారికి పంచామృతాలతో అభిషేకం చేసి భక్తి శ్రద్ధలతో పాటలు పాడుతూ పూజలు చేశారు. అనంతరం దువ్వ సదానందం-సుమతి దంపతులచే మహాన్నప్రసాదం నిర్వహించారు.

ఈ కార్యక్రమంలో పూజారి శ్రీకాంత్, మెట్టుగుట్ట చైర్మన్ పైడిపాల రఘుచందర్, గురుస్వాములు దండిగం సతీష్, పల్లపు నర్సింగరావు, పల్లపు రాజేందర్, కుర్ల మోహన్, బుర్ర రాజన్‌బాబు, పల్లపు కుమార్, ముంజ రమేష్, దువ్వ నవీన్, కల్లెపు భిక్షపతి, పల్లపు అర్జున్, కల్లెపు నర్సయ్య, దువ్వ శ్రీకాంత్ తదితరులు పాల్గొన్నారు.





అయ్యప్ప స్వామిని ఊరేగింపుగా మెట్టుగుట్టపైకి తీసుకువస్తున్న మాలధారులు

ఆధ్యాత్మికం

ప్రకృతి అందాల నాయిని గుట్ట

- ఆధ్యాత్మికతతో పాటు పచ్చని సోయగాలు మచ్చుపహడ్ సొంతం
- సొరిక ప్రాంతంలో వెలసిన వేంకటేశుడు
- నిత్య జలధార, శివరాత్రి జాతర ప్రత్యేకం



గుట్టపై ఉన్న వేంకటేశ్వరస్వామి ఆలయం, గర్భగుడిలో స్వామివారు

నర్మెట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : రెండు వైపులా రెండు రిజర్వాయర్లు.. పచ్చని అడవులు. చూడముచ్చటగొలిపే ప్రకృతి సోయగాలు.. వాటికి తోడు ఆధ్మాతిక పరిమళాలు మచ్చుపహడ్ నాయినిగుట్టల ప్రత్యేకం. వేంకటేశ్వరస్వామి ఆలయంతో పాటు అబ్బురపరిచే ప్రకృతి అందాలతో అలరారుతున్న మచ్చుపహడ్ నాయిని గుట్టలు ఎన్నో విశేషాలకు నిలయం. జనగామ జిల్లా నర్మెట మండలంలోని మచ్చుపహడ్ గ్రామంలో వేంకటేశ్వరస్వామి స్వయంభువుగా కొలువుదీరాడు. గుట్టపై చిన్న సొరికెలో (గుహ) నీటి ఊట ఉన్న ప్రాంతంలో తాను వెలిసినట్టు సాక్షాత్తు వేంకటేశ్వరస్వామియే ఓ వ్యక్తి కలలోకి వచ్చి చెప్పాడని, దాంతో 1969లో అదే ప్రాంతంలో ప్రజలు స్వామిని ప్రతిష్ఠించారట. నాటి నుంచి గుట్టపై పూజలు కొనసాగుతుండగా 1987లో గుడిని నిర్మించి సొరికె(గుహ)లో ఉన్న విగ్రహాన్ని గుడిలో ప్రతిష్ఠించారు. నాయిని గుట్టపై వెలవడంతో నాయిని వేంకటేశ్వర స్వామిగా సంబోధిస్తుంటారు. ఇక ఈ ప్రాంతంలో మరో విశేషం ఏంటంటే నీటి ఊట. మండు వేసవిలో కూడా ఇక్కడ జల దార వస్తూనే ఉంటుంది. నీటి ఊటలోని నీళ్లు తాగి మీద చల్లుకుంటే కోరిన కోర్కెలను వేంకటేశ్వరస్వామి తీరుస్తాడని ఇక్కడి ప్రజల విశ్వాసం. ఇక 1969 సంవత్సరంలో వేంకటేశ్వరస్వామి వెలసినప్పటి నుంచి ప్రతీ శివరాత్రికి మూడు రోజుల పాటు జాతర నిర్వహిస్తున్నారు. మధ్యలో కొన్ని సంవత్సరాలు జాతరను నిలిపేయగా.. గ్రామానికి మంచి జరగడం లేదని భావించి మళ్లీ 1981నుంచి జాతరను ప్రారంభించారు. జాతర చివరి రోజు గ్రామ ప్రజలంతా వనభోజనాలకు వెళ్లి గుట్ట వద్ద నిద్రిస్తారు.

కనువిందు చేస్తున్న పరిసరాలు

మండలంలోని మల్లన్నగండి రిజర్వాయర్, రఘునాథ్‌పల్లి మండలంలోని అశ్వరావుపల్లి రిజర్వాయర్‌కు మచ్చుపహడ్ గుట్ట మధ్యలో ఉంది. గుట్టపైకి ఎక్కి చూస్తే ముందు భాగం నుంచి అశ్వరావుపల్లి రిజర్వాయర్ కనిపిస్తుంది. వెనుక భాగంలో మల్లన్న గండి రిజర్వాయర్ ఉంది. రెండు రిజర్వాయర్ల మధ్య పచ్చటి అడవులతో ప్రకృతి రమణీయత ఉట్టిపడేలా మచ్చుపహడ్ నాయిని వెంకటేశ్వరస్వామి గుట్ట ప్రకృతి అందాలతో, ఆధ్యాత్మికతను పంచుతోంది. గుట్ట చూట్టూ గిరిజన సమూహాలు, పచ్చటి పంట పొలాలతో కనువిందు చేస్తోంది. పక్షుల కిలకిలలతో పరిసరాలు నయనానందకరంగా కనిపిస్తాయి. గుట్ట పరిసర ప్రాంతంలో వన్యప్రాణులు కూడా సంచరిస్తుంటాయి. ఇటు ప్రకృతి రమణీయత, అటు ఆధ్యాత్మికతతో ఉన్న మచ్చుపహడ్ గుట్టను ప్రభుత్వం గుర్తించి పర్యాటక ప్రాంతంగా గుర్తించాలి. మల్లన్నగండి రిజర్వాయర్‌ను సైతం పర్యాటక ప్రాంతంగా గుర్తించాలి. బాహ్య ప్రపంచానికి దూరంగా ప్రకృతి అందాల మచ్చుపహడ్ గుట్టను పర్యాటకంగా తీర్చిదిద్దాలని ఇక్కడి ప్రజలు కోరుతున్నారు.



గుట్టపై ఉన్న జలధార

సంక్షిప్త వార్తలు

సీపీఎం ఇంటింటి సర్వే

కేసముద్రం, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) : అర్పనపల్లిలో సీపీఎం ఆధ్వర్యంలో ఇంటింటి సర్వేను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా మండల కార్యదర్శి గొడిశాల వెంకన్న మాట్లాడారు. గ్రామంలో పోస్టాఫీసు లేక ఉపాధి హామీ పథకం డబ్బులు తీసుకునేందుకు ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. మండల కమిటీ సభ్యుడు నీరుటి జలేందర్, సోమారపు ఎల్లయ్య, అల్లుగొండ సావిత్ర పాల్గొన్నారు.

'ఆశ వర్కర్లను అరెస్ట్ చేయడం అప్రజాస్వామికం'

కేసముద్రం, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) : ఆశ వర్కర్లను అరెస్ట్ చేయడం ప్రజాస్వామికమని సీఐటీయూ మండల కార్యదర్శి జల్లె జయరాజ్ అన్నారు. కేసముద్రం పోలీస్‌స్టేషన్‌లో మంగళవారం పోలీసులు అదుపులోకి తీసుకున్న ఆశవర్కర్లను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. కాంగ్రెస్ అధికారంలోకి రాకముందు ఆశవర్కర్లకు రూ.18వేల వేతనం ఇస్తామని హామీ ఇచ్చి విస్మరించారని ఆరోపించారు.ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పి.సంజీవ, మల్లీశ్వరీ, పుష్ప, దేవేంద్ర, సువర్ణ, స్పందన, సుజాత, స్వరూప, అమృత, స్వర్ణలత, పద్మ, స్వరూప, అనిత, జ్యోతి, శిరీష, శారద పాల్గొన్నారు.

'ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో పారదర్శకత పాటించాలి'

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల ఎంపికల్లో పారదర్శకతను పాటించాలని జడ్పీ సీఈవో పురుషోత్తం అన్నారు. సండ్రలగూడెంలో మంగళవారం ఇందిరమ్మ ఇళ్ల సర్వేమ్యాపును పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఇళ్ల ఎంపికలో నిరుపేదలను మొదటి ప్రాధాన్యతలో గుర్తించాలని సూచించారు. ఇచ్చిన గడువులోగా ఎంపికలు పూర్తి చేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఎంపీడీవో రఘుపతిరెడ్డి, పంచాయతీ సిబ్బంది ఉన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

తొర్రూరు రూరల్, డిసెంబరు 10(ఆంధ్రజ్యోతి) : ఎస్సీ కార్పొరేషన్ ద్వారా అందించే ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకొని ఆర్థికాభివృద్ధి సాధించాలని ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్‌రావు అన్నారు. మంగళవారం తొర్రూరు మండలం అమ్మాపురంలో ఎస్సీ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ప్రభుత్వ పథకాలపై అవగాహన కల్పించారు. ఎంపీడీవో నర్సింగరావు, ఏఈవో సురేష్, ఏపీఎం సంజీవరావు, గ్రామస్పెషల్ ఆఫీసర్ వెంకటేశ్వర్లు, పంచాయతీ కార్యదర్శి శ్రావణి, ఎస్సీ నాయకులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాలో తప్పుడు ప్రచారంపై ఫిర్యాదు

మరిపెడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : డోర్నకల్ ఎమ్మెల్యే రాంచంద్రునాయక్ అసెంబ్లీలో మాట్లాడిన మాటలను వక్రీకరిస్తూ తప్పుడు ప్రచారం చేసిన బీఆర్ఎస్ సోషల్ మీడియా వారియర్స్‌పై మంగళవారం మరిపెడ పట్టణ కాంగ్రెస్ నేతలు పోలీ సులకు ఫిర్యాదు చేశారు. కారకులపై చట్టరీత్యా చర్యలు తీసుకోవాలని ఎస్సై సతీశ్‌ను వారు ఈ సందర్భంగా కోరారు. ఫిర్యాదు చేసిన వారిలో పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తాజుద్దీన్, జర్పుల విజయ్, బోర గంగయ్య, నరేశ్, ప్రమోద్, అక్బర్, రవి, లక్ష్మణ్, రాజేశ్, చంద్రశేఖర్ ఉన్నారు.

'ఛలో బస్ భవన్‌ను జయప్రదం చేయాలి'

తొర్రూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): తెలంగాణవ్యాప్తంగా ప్రజా రవాణాలో ఉన్న బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేస్తూ సీపీఐ ఎంఎల్ మాస్‌లైన్ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే బస్ భవన్ ముట్టడిని జయప్రదం చేయాలని ఆసంఘం డివిజన్ కార్యదర్శి ముంజంపల్లి వీరన్న అన్నారు. మంగళవారం తొర్రూరులో జరిగిన కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మహాలక్ష్మి పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం ప్రారంభించి వివిధ కారణాలతో రాష్ట్రవ్యాప్తంగా 3వేల బస్సులను తగ్గించడం సరికాదన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బీకూ, రాములు, యాకయ్య, రవి ఉన్నారు.

క్రీడలతోనే మానసిక ఉల్లాసం



పోటీలో పాల్గొన్న క్రీడాకారులతో నిర్వాహకులు

తొర్రూరు, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): క్రీడలతో ప్రతీ ఒక్కరికి మానసిక ఉల్లాసం ఉంటుందని మునిసిపల్ చైర్మన్ రాంచంద్రయ్య సీఎం కప్ క్రీడల కన్వీనర్ ప్రవీణ్‌రెడ్డి అన్నారు. మంగళవారం సీఎం కప్ క్రీడలను తొర్రూరులోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయనమాట్లాడుతూ మూడు రోజులపాటు ఎంపిక పోటీలు ఉంటాయని తెలిపారు. ఇక్కడ ప్రతిభ కనబరిచిన వారికి 20న జిల్లా కేంద్రంలో పోటీలు ఉంటా యన్నారు. అక్కడ గెలుపొందిన వారికి రాష్ట్రస్థాయిలో ఎంపి కలు ఉంటాయని తెలిపారు. మునిసిపల్ కమిషనర్ శాంతికుమార్, ఎంఈవో బుచ్చయ్య, టీచర్లు లక్ష్మీనారాయణ, బ్రహ్మానం దరెడ్డి, మునిసిపల్ సిబ్బంది పాల్గొన్నారు.

సమస్యలు పరిష్కరించాలి

ఇనుగుర్తి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఆశవర్కర్ల సమస్యలను పరిష్కరించాలని పీహెచ్‌సీ వైద్యాధికారి సురేష్‌కు మంగళవారం వారు వినతిపత్రాన్ని అందజేశారు. మెట్టు సుజాత, రాధ, శ్యామల, శీలత, రజిత, అరుణ, లక్ష్మి, కళ్యాణి, ఆశ, మంజుల, రమ, జ్యోతి పాల్గొన్నారు.



డోర్నకల్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



కురవిలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



తొర్రూరులో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న బీఆర్ఎస్ నాయకులు



మరిపెడలో తెలంగాణ తల్లి ఫ్లెక్సీకి క్షీరాభిషేకం చేసి మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే రెడ్యానాయక్



మానుకోటలో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేస్తున్న శంకర్‌నాయక్, రాంమోహన్‌రెడ్డి

తెలంగాణ తల్లి విగ్రహాలకు క్షీరాభిషేకం

మహబూబాబాద్‌టౌన్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి): కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ తల్లి విగ్రహ రూపాన్ని మార్చడాన్ని వ్యతిరేకిస్తూ.. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపులో భాగంగా ఆ పార్టీ ఆధ్వర్యంలో జిల్లా వ్యాప్తంగా తెలంగాణ తల్లి విగ్రహాలకు మంగళవారం క్షీరాభిషేకం చేశారు. మహబూబాబాద్ బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా హాజరైన మాజీ ఎమ్మెల్యే బానోత్ శంకర్‌నాయక్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర సాధన కోసం మాజీసీఎం కేసీఆర్ ఎన్ని పోరాటాలు చేశారో ప్రజలకు తెలుసని చెప్పారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి హుందాగా వ్యవహరించాలని, మాజీ సీఎం కేసీఆర్‌ను తిట్టడమే పనిగా పెట్టుకున్నారని ఆరోపించారు. తెలంగాణ రాష్ట్రం ఏర్పాటు కాకుంటే రేవంత్‌రెడ్డి సీఎం అయ్యేవారా ఒక్కసారి ఆత్మపరిశీలన చేసుకోవాలన్నారు. విగ్రహాల రూపాలను మార్చడం కాదని, ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేసి వారి జీవితాల్లో వెలుగులు నింపాలని హితవు పలికారు. మునిసిపల్ చైర్మన్ పాల్వాయి రాంమోహన్‌రెడ్డి, వైస్ చైర్మన్ మార్నేని వెంకన్న, పీఏసీఎస్ చైర్మన్ నాయిని రంజిత్, ఎమ్డీ. ఫరీద్, తేళ్ల శ్రీనివాస్, ముత్యం వెంకన్న, ఆవుల వెంకన్న, లూనావత్ అశోక్‌నాయక్, కత్తుల ఎలెందర్, నర్సింగం వెంకన్న, ఆంగోతు కిషన్, ఆసిఫ్, రామరాజు యాకన్న, గంధం ఉప్పలయ్య, గుట్టయ్య, షఫీయుద్దీన్, డౌలాగర్ శంకర్ పాల్గొన్నారు.

వివిధ మండలాల్లో..

మరిపెడలో బీఆర్ఎస్ నేతలు తెలంగాణతల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. డోర్నకల్ మాజీ ఎమ్మెల్యే డీఎస్ రెడ్యానాయక్, జిల్లా గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ గుడిపుడి నవీన్ రావు, మునిసిపల్ చైర్ పర్సన్ సింధూరకుమారి, నాయకులు అచ్యుత్‌రావు, తాళ్లపల్లి శ్రీనివాస్, రఘు, బాల్ని మాణిక్యం, అశోక్‌రెడ్డి, నాగేశ్వర్‌రావు, రవీందర్‌నాయక్ పాల్గొన్నారు.

• దంతాలపల్లిలో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. మాజీ ఎంపీపీ ఉమ, మండల పార్టీ అధ్యక్షుడు వేణు, మల్లారెడ్డి, కిషోర్, వెంకట్‌రెడ్డి, రాములు పాల్గొన్నారు.

• తొర్రూరులో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. మాజీ జడ్పీటీసీ మంగళంపల్లి శ్రీనివాస్, చిన్న అంజయ్య, ప్రదీప్‌రెడ్డి, కుర్ర శ్రీను, చామకూరిఐలయ్య, శ్రీనివాసరావు, రవి పాల్గొన్నారు.

• డోర్నకల్ గాంధీ సెంటర్‌లో తెలంగాణ తల్లి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. పీఏసీఎస్ చైర్మన్ బిక్షంరెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ విద్యాసాగర్, పాండునాయక్, యశోదర్ జైన్, కొత్త వీరన్న, గౌస్‌పాషా, వెంకటేశ్వర్లు, శ్రీనివాస్‌నాయక్, రహీమ్, శరత్‌బాబు పాల్గొన్నారు.

• కురవి దేవాలయ సెంటర్‌లో తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. బీఆర్ఎస్ మండల పార్టీ అధ్యక్షుడు తోట లాలయ్య, జిల్లా నాయకులు బజ్జూరి పిచ్చిరెడ్డి, గుగులోతు రవి, నూతక్కి నర్సింహరావు, ఐలి నరహరి, రాజునాయక్, బాదె నాగయ్య, చిన్నం భాస్కర్, కొణతం విజయ్, గాడిపెల్లి రాములు, గుగులోతు నెహ్రూ, వినోద్ పాల్గొన్నారు.

• పెద్దవంగర మండలంలోని బొమ్మకల్లు గ్రామంలో మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు ఆదేశాల మేరకు తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఈదురు ఐలయ్య, రాంచంద్రయ్య శర్మ, సంజయ్, వెంకన్న, సుదీర్, జ్ఞానేశ్వరచారి, వెంకట్రామయ్య, సాయిలు, గంగాధర్, వీరన్న, విజయ్, హరీష్, సమ్మయ్య, ఐలయ్య, రామ్మూర్తి, సందీప్ పాల్గొన్నారు.

• బయ్యారం మండల కేంద్రం కాకతీయ నగర్‌లోని తెలంగాణ తల్లి విగ్రహానికి క్షీరాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీఆర్ఎస్ నేతలు ఆంగోతు శ్రీకాంత్ నాయక్, గంగుల సత్యానారాయణ, ఐలయ్య, జర్పుల శ్రీనునాయక్, గిరినాయక్, శివాజీ, రమేష్ పాల్గొన్నారు.

హామీలను అమలు చేయాలి : సీపీఎం



గిరిప్రసాద్‌నగర్‌కాలనీలో మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన హామీలను అమలు చేయాలని, లేనిపక్షంలో పాలకులు ప్రజా ఆగ్రహానికి గురికాక తప్పదని సీపీఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్ హెచ్చరించారు. మహబూబాబాద్ మునిసిపల్ 15వ వార్డు పరిధిలోని గిరిప్రసాద్‌నగర్ కాలనీలో సీపీఎం వన్‌టౌన్ ఏరియా కమిటీ ఆధ్వర్యంలో మంగళవారం ప్రజా సమస్యలపై అధ్యయనం కోసం ఇంటింటికి సీపీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం ఆరుగ్యారంటీలను అమలు చేయకుంటే ప్రజా ఉద్యమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. పట్టణకార్యదర్శి బానోత్ సీతారాంనాయక్, వన్‌టౌన్ ఏరియా కార్యదర్శి రావుల రాజు, గాడిపెల్లి ప్రమీల, శాగంటి భాగ్యమ్మ, చీపిరి యాకన్న, సుధాకర్, రమాదేవి, రాంబాబు, వెంకన్న, వినయ్, ఉమా, నిర్మల, సరిత పాల్గొన్నారు.

● మునిసిపల్ 13వ వార్డు పరిధిలో ఇంటింటికి సీపీఎం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణకమిటీ సభ్యులు కుమ్మరికుంట్ల నాగన్న మాట్లాడుతూ పట్టణ శివార్లలోని కాలనీల్లో మౌళిక సదుపాయాలు కల్పించడంలో పాలకులు విఫలమయ్యారని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో బోడ శంకర్, చిట్టిమల్ల ఉపేందర్, శ్రీరాములు, నాన్కి, బ్రహ్మం, శ్రీను, వెంకన్న, వీరన్న, ఆజాద్, జ్యోతి, విజయ, రఘు, వెంకటేష్, ఉపేందర్ పాల్గొన్నారు.

మహిళపై కత్తితో దాడి ఘటనలో నిందితుడికి మూడేళ్ల జైలు

● జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జీ సురేష్ తీర్పు

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : భూ వివాదంలో మహిళపై కత్తితో దాడి చేసిన ఘటనలో వ్యక్తికి మూడేళ్ల జైలుశిక్షతో పాటు రూ. 5 వేల జరిమానా విధిస్తూ మహబూబాబాద్ జిల్లా కోర్టు సీనియర్ సివిల్ జడ్జీ సురేష్ మంగళవారం తీర్పు వెల్లడించారు. కోర్టు కానిస్టేబుల్ సంపత్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని చాపలమార్కెట్ సమీపంలో నివాసముంటున్న చామకూరి స్వరూపపై వెంకట్రామ థియేటర్ సమీపంలో ఉంటున్న గట్టు రమేష్ స్వంత బామ్మర్ది భార్య స్వరూపపై 2018 జూన్ 5న భూతగాదా విషయంలో రమేష్ స్వరూపపై కత్తితో దాడి చేయగా తీవ్రంగా గాయపడిందని చెప్పారు. ఆమె ఇచ్చిన ఫిర్యాదు మేరకు అప్పటి టౌన్ ఎస్సై అరుణ్‌కుమార్ కేసు నమోదు చేశారని తెలిపారు. 2019 ఫిబ్రవరి 21న కోర్టులో చార్జీ షీటు దాఖలు చేయగా, గత ఏడు నెలలుగా కోర్టులో కేసు నడుస్తుండగా 9 మంది సాక్షులను ప్రవేశ పెట్టగా పబ్లిక్ ప్రాసిక్యూటర్ (పీపీ) సంతోషిణి వాదనలు వినిపించగా, పూర్వాపరాలు పరిశీలించిన జిల్లా కోర్టు సీనియర్ జడ్జీ సురేష్ 2024 డిసెంబరు 10న నిందితుడు రమేష్‌కు 3 ఏళ్ల జైలు శిక్షతో పాటు రూ. 5 వేల జరిమాన విధిస్తూ తీర్పు వెల్లడించారు. టౌన్ సీఐ పెండ్యాల దేవేందర్ ఆధ్వర్యంలో పీసీ రవీందర్ సాక్షులకు ప్రవేశపెట్టడం జరిగిందన్నారు.

ఆశ్రమ పాఠశాలలను తనిఖీ చేసిన తహసీల్దార్

● 'ఆంధ్రజ్యోతి' కథనానికి స్పందించిన కలెక్టర్

దంతాలపల్లి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఈనెల 9న ఆంధ్రజ్యోతి దినపత్రికలో ప్రచురితమైన' సమస్యల వలయంలోవసతి గృహాలు' శీర్షికన వెలువడిన కథనంపై కలెక్టర్ స్పందించారు. ఆయన ఆదేశాలతో స్థానిక తహసీల్దార్ రాజేశ్వర్ పెచ్చులూడుతున్న మండల కేంద్రంలోని గిరిజన ఆశ్రమ పాఠశాల, జ్యోతిబాపూలే ఆశ్రమ పాఠశాలను మంగళవారం తనిఖీ చేశారు. నివేదికను కలెక్టర్‌కు పంపుతున్నట్లు తహసీల్దార్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జ్యోతిబాపూలే ఆశ్రమ పాఠశాల అద్దె భవనంలో కొనసాగుతుండడంతో స్వల్ప ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. ఈ కార్యక్రమంలో గిర్దావర్ నజీముద్దీన్ పాల్గొన్నారు.



దంతాలపల్లిలోని జ్యోతిబాపూలే ఆశ్రమ పాఠశాలను సందర్శిస్తున్న తహసీల్దార్ రాజేశ్వర్

'స్థానిక సంస్థల ఎన్నికల్లో సీపీఐని ఆదరించండి'



సీపీఐ సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కార్యదర్శి బి.విజయసారథి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) : త్వరలో జరగబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో భారత కమ్యూనిస్టు పార్టీ (సీపీఐ) ని ఆదరించాలని ఆ పార్టీ జిల్లా కార్యదర్శి బి.విజయసారథి అన్నారు. మహబూబాబాద్ పట్టణంలోని మార్వాడి సత్రం బజారులో మునిసిపల్ 19వవార్డు సీపీఐ ఎన్నికల సన్నాహక సమావేశాన్ని కన్వీనర్ చిదిరాల జ్ఞానేశ్వర్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా కార్యదర్శి విజయసారథి మాట్లాడుతూ మునిసిపల్ ఎన్నికల్లో మెజార్టీ వార్డుల్లో, సర్పంచ్, ఎంపీటీసీ, జడ్పీటీసీ ఎన్నికల్లో సీపీఐని గెలిపించాలని చెప్పారు. ప్రజా సమస్యలపై నిరంతరం పోరాడుతున్న సీపీఐ నాయకులను గెలిపిస్తే వారు సమస్యల పరిష్కారానికి కృషి చేస్తారని చెప్పారు. వచ్చే మునిసిపాలిటీ ఎన్నికల్లో 19వ వార్డును ఖచ్చితంగా కైవసం చేసుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో మునిసిపల్ ఫ్లోర్ లీడర్ బి. అజయ్‌సారధిరెడ్డి, పట్టణ కార్యదర్శి పెరుగుకుమార్, రేషపల్లి నవీన్, చింతకుంట్ల వెంకన్న, మామిండ్ల సాంబలక్ష్మి, కేదాసు రమేష్, భాగ్యలక్ష్మి, రాణి, సత్యం, నక్క నాగార్జున, నీలం వెంకటేశ్వర్లు, చిదిరాల శరన్, అరుణ, శ్యాం ప్రసాద్, డి. రమేష్ పాల్గొన్నారు.



కేసముద్రం ఠాణాను పరిశీలిస్తున్న డీఎస్పీ తిరుపతిరావు

పోలీస్‌స్టేషన్‌ను పరిశీలించిన డీఎస్పీ

కేసముద్రం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం పోలీస్‌స్టేషన్‌ను మంగళవారం డీఎస్పీ తిరుపతిరావు పరిశీలించారు. ఈ సందర్భంగా స్టేషన్‌లోని రికార్డులను, కేసుల వివరాలు, పోలీసు సిబ్బందిను పరిశీలించారు. శాంతిభద్రతల పరిరక్షణ కోసం అహర్నిశలు కృషి చేయాలని డీఎస్పీ సూచించారు. కార్యక్రమంలోమహబూబాబాద్ రూరల్ సీఐ సర్వయ్య, ఎస్ఐ మురళీధర్‌రాజ్ పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ప్రజా సమస్యల పరిష్కారానికి తన వంతు కృషి చేస్తున్నట్లు మునిసిపల్ చైర్మన్ రాంమోహన్‌రెడ్డి అన్నారు. మహబూబాబాద్ మునిసిపల్ 10వ వార్డు పరిధిలోని కుమ్మరికుంటతండాలో యానిమల్ బర్త్ కంట్రోల్ (ఏబీసీ) సెంటర్‌ను మంగళవారం సందర్శించారు. వీధి కుక్కల నియంత్రణకు తీసుకుంటున్న చర్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం తండాలో డ్రైనేజీ సమస్యను పరిశీలించి అధికారులకు తగుసూచనలు చేశారు. వైస్‌చైర్మన్ మార్నేని వెంకన్న, వార్డు కౌన్సిలర్ భూక్య శ్రీను, ఏఈ కుమార్, డౌలాగర్ శంకర్ పాల్గొన్నారు.

'కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలి'

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వృత్తిలో ప్రమాదాలకు గురి కాకుండా ఉండేలా కల్లుగీత కార్మికులందరికి కాటమయ్య రక్షణ కవచం ఇవ్వాలని తెలంగాణ కల్లుగీత కార్మిక సంఘం (టీకేజీకేఎస్) రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ డిమాండ్ చేశారు. మహబూబాబాద్ పెరుమాండ్ల జగన్నాథం భవన్‌లో సంఘం జిల్లా కమిటీ సమావేశాన్ని మంగళవారం యమగాని వెంకన్న అధ్యక్షతన నిర్వహించారు. జిల్లా కార్యదర్శి గౌని వెంకన్న, గునిగంటి మోహన్, వెంకటేశ్వర్లు, ఉప్పలయ్య, వీరస్వామి,యాకన్న, సత్యనారాయణరెడ్డి, శ్రీనివాస్, వెంకన్న, మల్లయ్య, రవి, సోమయ్య, రామన్న పాల్గొన్నారు.



టీకేజీకేఎస్ జిల్లా కమిటీ సమావేశంలో మాట్లాడుతున్న రాష్ట్ర అధ్యక్షుడు మేకపోతుల వెంకటరమణ

రాష్ట్ర హౌసింగ్ బోర్డు డైరెక్టర్ గౌతమ్‌ను కలిసిన దైద వెంకన్న

మహబూబాబాద్ టౌన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): హైదరాబాద్ సచివాలయంలో తెలంగాణ రాష్ట్ర హౌసింగ్‌బోర్డు డైరెక్టర్ వీపీ.గౌతమ్‌ను మంగళవారం మహబూబాబాద్ పట్టణానికి చెందిన వన ప్రేమికుడు, హరిత మిత్ర అవార్డు గ్రహీత దైద వెంకన్న కలిశారు. రాష్ట్ర హౌసింగ్‌బోర్డు డైరెక్టర్ వీపీ.గౌతమ్‌కు మొక్కను బహూకరించారు. పర్యావరణ పరిరక్షణ కోసం తన జీవితాన్ని అంకితం చేసి 16ఏళ్ల తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా మొక్కలు నాటుతున్నానని వన ప్రేమికుడు దైద వెంకన్న తెలిపారు. తన కుటుంబం నివాసముండేందుకు మానుకోటలో ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేయించాలని దైద వెంకన్న కోరారు.

'బస్‌భవన్‌ను జయప్రదం చేయండి'

మహబూబాబాద్ రూరల్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్‌లో బుధవారం నిర్వహించనున్న చలో బస్ భవన్‌ను జయప్రదం చేయాలని సీపీఐ (ఎంఎల్) మాస్‌లైన్ ప్రజాపంథా జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి పిలుపునిచ్చారు. మహబూబాబాద్‌లోని పార్టీ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణవ్యాప్తంగా ప్రజారవాణాలు ఉన్న బస్సుల సంఖ్యను పెంచాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మహాలక్ష్మీ పథకం పేరుతో మహిళలకు ఉచిత బస్ ప్రయాణం ప్రారంభించిన సీఎం రేవంత్‌రెడ్డి రక రకాల పేరుతో 3 వేల బస్సులను తగ్గించారని, ఇప్పటికైనా బస్సుల సంఖ్యను పెంచాలని డిమాండ్ చేశారు. బిల్లకంటి సూర్యం, ఫైండ్ల యాకయ్య, ఉమ్మగాని సత్యం, జక్కుల యాకయ్య, రంగయ్య పాల్గొన్నారు.

దివ్యాంగులకు ప్రాధాన్యత కల్పించాలి

బయ్యారం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల ఎంపికలో దివ్యాంగులకు మొదటి ప్రాధాన్యత కల్పించాలని దివ్యాంగుల సంఘం నాయకులు రాంబాబు, భారతి, ఉపేందర్, రషీద, సహదేవుడు, వెంకన్న అన్నారు. బయ్యారంలో మంగళవారం ప్రపంచ దివ్యాంగుల దినోత్సవాన్ని పురస్కరించుకొని కేక్ కట్ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎన్నికలకు ముందు కాంగ్రెస్ ప్రభుత్వం ప్రకటించిన వికలాంగుల పెన్షన్‌ను రూ. 6 వేలకు పెంచి అమలు చేయాలన్నారు. మాధవి, క్రిష్ణ, వాసు, సంపత్, సునీల్, వినోద్‌రెడ్డి పాల్గొన్నారు.

'సమస్యలను తక్షణమే పరిష్కరించాలి'

కురవి, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : ఉపాధ్యాయుల పెండింగ్ సమస్యలను తక్షణమే ప్రభుత్వం పరిష్కరించాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ యాకూబ్ డిమాండ్ చేశారు. కురవిలో మంగళవారం టీ.మంజుల అధ్యక్షతన జరిగిన సంఘం ఆఫీస్ బేరర్స్ సమావేశంలో ఆయన మాట్లాడారు. మండల ప్రధాన కార్యదర్శి ఎం. ప్రవీణ్‌కుమార్, ఉపాధ్యక్షులు ఎస్. శైలజ, డి. వీరన్న, బాలరాజు, బాబు, సురేష్, రమ్య, ప్రదీప్, మాధవి, భాస్కర్, వరప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

డోర్నకల్ ఎస్సై ఉమ

డోర్నకల్ డిసెంబరు10 (ఆంధ్రజ్యోతి) : సైబర్ నేరాలతో పాటు కొన్ని వ్యవస్థ కృత నేరాలపట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గడ్డం ఉమ అన్నారు. మంగళవారం డోర్నకల్ పోలీస్‌స్టేషన్ ఆవరణలో ప్రజలతో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆమె మాట్లాడుతూ గంజాయి, నల్లబెల్లం, రేషన్ బియ్యం, అక్రమ రవాణా, గుడుంబా తయారు వంటి నేరాలకు పాల్పడే వారి వివరాలను ప్రజలు పోలీసులకు తెలియ జేయాలన్నారు. సైబర్ నేరగాళ్లు లాటరీ తగిలిందని, డిజిటల్ అరెస్టు, ఇంటివద్ద నుండే వేల రూపాయలు సంపాదించుకోవచ్చునని రకరకాలుగా ఫోన్లుచేసి మోసాలకు పాల్పడుతున్నారని వారి మాటలను నమ్మవద్దని వారికి బ్యాంకు ఎకౌంటు వివరాలు అడిగినా ఇవ్వవద్దని సూచించారు. పోలీసులు పాల్గొన్నారు.

కల్వర్ట్ గుంతలో పడిన ద్విచక్రవాహనం

• ఇద్దరికి గాయాలు



వాగు కల్వర్టులో పడిన ద్విచక్రవాహనం

కొత్తగూడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : వాగు ఉధృతికి సైడ్‌బర్మ్ కొట్టుకుపోగా ఎర్పడిన భారీగుంతలో పడితే ప్రమాదం జరిగే అవకాశం ఉందని రెండు రోజుల ముందు 'ఆంధ్రజ్యోతి' హెచ్చరించిన రెండు రోజుల్లోనే గుంతలో పడి ఇద్దరికి గాయాలైన సంఘటన కొత్తగూడలో మంగళవారం జరిగింది. ఈనెల 8న 'ఆంధ్రజ్యోతి'లో 'ప్రమాదకరంగా రోడ్డు' అనే కథనం ప్రచురితమైంది. కాగా, మంగళవారం అదే దారిలో వస్తున్న ద్విచక్రవాహనం ఎదురుగా వస్తున్న వాహనంను తప్పించబోయి ద్విచక్రవాహనం అదుపుతప్పి రోడ్డు పక్కన ఉన్న గుంతలో పడి బోడ సాయిలు, గాదె రక్షీకలకు తీవ్ర గాయాలు కాగా, ఆస్పత్రికి తరలించారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి రోడ్డు సైడ్ ఉన్న గుంతలను పూడ్చాలని ప్రజలు కోరుతన్నారు.

రేపు జిల్లాస్థాయి గణిత టాలెంట్ టెస్ట్

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : మండలం మాటేడు జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఈనెల 11న జిల్లాస్థాయి గణిత టాలెంట్ టెస్ట్ నిర్వహించనున్నట్లు గణిత ఫోరం జిల్లా అధ్యక్షుడు టి.మాధవాచారి, రాష్ట్ర కౌన్సిలర్ కాసం శ్రీనివాసరావు తెలిపారు. ఈ మేరకు మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో మంగళవారం డీఈవో రవీందర్‌రెడ్డిని కలిసి జిల్లాస్థాయి గణిత టాలెంట్ టెస్ట్ పోటీలకు ముఖ్యఅతిథులుగా హాజరుకావాలని ఆహ్వానించారు.

క్రైం కార్నర్

కుటుంబ కలహాలతో కూలీ ఆత్మహత్య

కేసముద్రం, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం స్టేషన్ లచ్చీరాంనాయక్ తండాలో మంగళవారం సాయంత్రం వ్యవసాయ కూలీ బానోత్ రవి (40) ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకున్నట్లు తండావాసులు తెలిపారు. కుటుంబ కలహాలతో క్షణికావేశంలో ఉరి వేసుకున్నట్లు తండావాసులు చెబుతున్నారు. రవికి భార్య జాని, ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు.

25 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

• వాహనం సీజ్, ఇద్దరిపై కేసు నమోదు



బియ్యంతో వాహనాన్ని పట్టుకున్న పోలీసులు

నర్సింహులపేట, డిసెంబరు10(ఆంధ్రజ్యోతి) : అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యాన్ని పోలీసులు స్వాధీనం చేసుకుని వాహనాన్ని సీజ్ చేసిన ఘటన మండలంలో జరిగింది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం. పెద్దనాగారం గ్రామ సమీపంలో మంగళవారం పోలీసులు వాహన తనిఖీలు చేపట్టారు. ఈ క్రమంలో అటువైపుగా వచ్చిన ఓవాహనం అనుమానంగా కనిపించడంతో వాహనాన్ని తనిఖీ చేసి, 50 తెల్లబస్తాలల్లో 25 క్వింటాల పీడీఎస్ బియ్యం ఉన్నట్లు గుర్తించి స్వాధీ నం చేసుకొని, వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు. బియ్యం తరలిస్తున్న మరిపెడ మండలానికి చెందిన మూడ్ నరేష్, జాటోతు సురేష్‌పై కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

చికిత్స పొందుతూ యువతి మృతి



మనీష(ఫైల్)

నర్సింహులపేట, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి): చికిత్స పొందుతూ యువతి మృతి చెందిన ఘటన మండలంలోని చోటు చేసుకుంది. ఎస్సై సురేష్ తెలిపిన వివరాల ప్రకారం. పెద్దనాగారానికి చెందిన నాగన్నబోయిన మనీష (22) డిగ్రీ పూర్తిచేసి ఇంటి వద్దనే ఉంటోంది. త్వరలో జరుగనున్న బాబాయ్ కూతురు (సోదరి) వివాహానికి కొత్తబట్టలు కొనివ్వలేదని మనస్తాపంతో ఈనెల 6న గడ్డిమందు తాగింది. గమనించిన కుటుంబ సభ్యులు జిల్లా కేంద్రంలోని ఓ ప్రైవేటు ఆస్పత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం పరిస్థితి విషమించి మృతి చెందింది. తండ్రి నర్సయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

లారీబోల్తా : డ్రైవర్‌కు గాయాలు

మరిపెడ, డిసెంబరు 10 (ఆంధ్రజ్యోతి) : లారీ బోల్తా పడి డ్రైవర్ గాయపడిన ఘటన మంగళవారం తెల్లవారు జామున మరిపెడ సోషల్‌వెల్ఫేర్ గురుకుల పాఠశాల సమీ పంలో 563 జాతీయ రహదారిపై చోటు చేసుకుంది. పెద్దవంగర నుంచి ధాన్యంలోడ్‌తో మరిపెడ బంగ్లాకు వస్తున్న లారీ జాతీయ రహదారిపై ఏర్పడిన గుంతలతో అదుపు తప్పి పల్టీ కొట్టింది. దీంతో డ్రైవర్ అహ్మద్ స్వల్పగాయాలు కాగా, ఆయనను స్థానికుల ఆస్పత్రికి తరలించారు.



బోల్తా పడిన లారీ